



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 154 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 15 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 154 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 15 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఈ విషయంలో మనమంతా ఏకమవుదాం

### చంద్రబాబు సహా దక్షిణాది రాష్ట్రాల సీఎంలకు రేవంత్ రెడ్డి లేఖ

- లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై సీఎంలకు లేఖలు రాసిన రేవంత్ రెడ్డి
- జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని ఆందోళన
- ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ సీఎంలకు రేవంత్ రెడ్డి లేఖ




**హైదరాబాద్ పెన్ పవర్:**లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక చర్యలు చేపట్టారు. జనాభా ప్రాతిపదికన ఈ ప్రక్రియ చేపడితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఐక్య పోరాటానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌లకు ఆయన లేఖలు రాశారు. ఈ అంశంపై దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసికట్టుగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.
లోక్‌సభ సీట్ల సర్దుబాటును దక్షిణాది రాష్ట్రాల రాజకీయ హక్కులపై జరుగుతున్న దాడిగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. "దక్షిణాదిపై జరుగుతున్న ఈ దాడిని ఎదుర్కోవడానికి మనమంతా ఏకం కావాలి. ఢిల్లీలో మన గొంతుకను కాపాడుకోవాలి" అని తన లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను అనుసరించి జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలకు బహుమతికి బదులుగా శిక్షపడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, రాజకీయంగా ప్రాబల్యం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ప్రమాదాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందరికంటే ముందుగానే గుర్తించారని రేవంత్ రెడ్డి ప్రశంసించారు. గత సంవత్సరం మార్చిలోనే చెన్నైలో దక్షిణాది రాష్ట్రాల నేతలతో సమావేశం నిర్వహించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ స్ఫూర్తితో అందరూ కలిసి ముందుకు సాగాలని కోరారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన సిద్ధాంతాలను గుర్తుచేస్తూ "చైతన్యవంతులను చేయండి, ఆందోళన చేయండి, సంఘటితం కండి" అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.
"దక్షిణ భారతదేశానికి అత్యంత కీలకమైన ఈ విషయంలో మనమంతా ఏకం కావాలని ఈ లేఖ రాస్తున్నాను. రాజకీయ హక్కులపై జరుగుతున్న ఈ దాడిని మనం ఎదిరించి, ఢిల్లీలో మన గొంతుకను కాపాడుకోవాలి" అంటూ లేఖలో పేర్కొన్నారు. ఈ తీవ్రమైన సమస్యపై అందరూ కలిసి ముందుకు సాగాలని, ఐక్యంగా కవాతు చేద్దామని రేవంత్ తన లేఖను ముగించారు.

## ఛత్తీస్‌గఢ్‌లోని పవర్ ప్లాంట్‌లో పేలుడు... 9 మంది మృతి

- శక్తి జిల్లాలోని సింగితరాయ్ గ్రామంలోని వేదాంత పవర్ ప్లాంట్‌లో ప్రమాదం
- బాయిలర్ ట్యూబ్‌లో పేలుడు
- 30 మందికి పైగా గాయాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఛత్తీస్‌గఢ్‌లోని వేదాంత పవర్ ప్లాంట్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. శక్తి జిల్లాలోని సింగితరాయ్ గ్రామంలోని ఈ విద్యుత్ ప్లాంట్‌లో మధ్యాహ్నం బాయిలర్

మిగతా 2లో

## కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాట కార్యాచరణ

- ఏప్రిల్ 20న కేసీఆర్ అధ్యక్షతన జగిత్యాలలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు కేటీఆర్ వెల్లడి
- ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించబోతున్నట్లు ప్రకటన
- మే, జూన్ నెలల్లో ప్రత్యక్ష పోరాటాలను ప్రారంభించనున్నట్లు వెల్లడి




**హైదరాబాద్ పెన్ పవర్:**వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాబోయే పోరాటాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో



## అంబేద్కర్ అసమానతలు లేని సమాజాన్ని కోరుకున్నారు

- అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన కవిత
- అంబేద్కర్ అంటేనే ధైర్యం అన్న కవిత
- తెలంగాణ ఏర్పడింది అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే అన్న కవిత

**హైదరాబాద్ పెన్ పవర్:**డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అసమానతలు లేని సమాజాన్ని కోరుకున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఫోరమ్ ఆధ్వర్యంలో కవిత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంబేద్కర్ అంటేనే ధైర్యం అని అన్నారు. పేదల తలరాతను మార్చగలిగే శక్తి భారత రాజ్యాంగానికి ఉందని పేర్కొన్నారు. అసమానతలు లేని సమాజాన్ని కోరుకున్న అంబేద్కర్ ఆశయ సాధన కోసం అందరం ప్రయత్నిద్దామని పిలుపునిచ్చారు. ఈరోజు తెలంగాణ ప్రత్యేక తెలంగాణగా ఏర్పడిందంటే అది అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే అని పేర్కొన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 3 లేకపోతే, ఆ రాజ్యాంగం మనకు శక్తిని ఇవ్వకపోతే తెలంగాణ ఉద్యమానికి నైతిక పునాది లేకపోయేదని అన్నారు.

మిగతా 2లో

## ఆర్టీసీలో సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా

మిగతా 2లో



## ప్రధాని నరేంద్రమోదీకి సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతిస్తున్నట్లు వెల్లడి
- నియోజకవర్గాల పునర్విభజన బిల్లును మహిళా బిల్లుతో కలపవద్దని విజ్ఞప్తి
- దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాలని సూచన

మిగతా 2లో

## మోదీకి ట్రంప్ ఫోన్... 40 నిమిషాల పాటు సంభాషణ

- ఈ సంవత్సరం వీరిద్దరు ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇది మూడోసారి
- ద్వైపాక్షిక సహకారం సాధించిన పురోగతిపై చర్చించినట్లు వెల్లడి
- పశ్చిమాసియా ఉద్రిక్తతలు, హర్మూజ్ జలసంధిపై చర్చించామన్న మోదీ

మిగతా 2లో





## బీహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి

- బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన సామ్రాట్ చౌదరి
- నేడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం
- కుష్వాహా సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి

మిగతా 2లో

## నియోజకవర్గాల పునర్విభజన...

### 543 నుంచి 850కి పెరగనున్న లోక్ సభ స్థానాలు

- ఈ నెల 16న పార్లమెంటులో పునర్విభజన, మహిల్ రిజర్వేషన్ బిల్లులు
- బిల్లులకు సంబంధించి ఎంపీలకు సమాచారం
- రాష్ట్రాల్లో 815 వరకు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 35 వరకు సీట్లు పెరిగే అవకాశం



**పెన్ పవర్ డెస్క్:**నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ప్రకారం, లోక్ సభ సీట్లు 543 నుంచి 850కు పెరిగే అవకాశం ఉంది. ఈ నెల 16న నియోజకవర్గాల పునర్విభజ న బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారం ఇచ్చింది. బిల్లులకు సంబంధించిన ప్రతులను పంపించింది. పునర్విభజన బిల్లు ప్రకారం రాష్ట్రాల్లో

మిగతా 2లో

## నన్ను నమ్మండి... ఇవి మోసపూరితమైనవి కావు

### తమిళనాడు ఓటర్లపై విజయ్ హామీల వర్షం



- తిరుప్పూర్ ఎన్నికల సభలో కీలక హామీలు ప్రకటించిన టీవీకే అధినేత విజయ్
- చేనేత కార్మికులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలు
- ఏప్రిల్ 16న పార్టీ పూర్తిస్థాయి మేనిఫెస్టో విడుదల చేస్తామని వెల్లడి
- తమిళనాడులో 'విజిల్ విప్లవం' కోసం తనకు మద్దతు ఇవ్వాలని ప్రజలకు పిలుపు

**పెన్ పవర్ డెస్క్:**మిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్.. తన ఎన్నికల ప్రచారంలో హామీల వర్షం కురిపించారు. తమిళనాడు రాజకీయాల్లో కీలకమైన కొంగు ప్రాంతంలోని టెక్స్‌టైల్ హబ్‌గా పేరుగాంచిన తిరుప్పూర్‌లో మంగళవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు, రైతులు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. తమ పార్టీ పూర్తిస్థాయి ఎన్నికల మేనిఫెస్టోను ఏప్రిల్ 16న పుస్తక

మిగతా 2లో

## తెలంగాణలో మండుతున్న ఎండలు... పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

- పలు ప్రాంతాల్లో 42 డిగ్రీలుగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం 9 నుంచి భానుడి భగభగ
- గురువారం నుంచి మరింత పెరగనున్న ఎండల తీవ్రత



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారింది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచే భానుడి భగభగతో ప్రజలు

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# సంప్రదాయ కళల మనుగడ ఏదీ?

ప్రపంచ వ్యాప్తంగా కళలను, కళాకారులను గౌరవించడానికి, ప్రజల్లో కళల పట్ల అవగాహన పెంపొందించడానికి ప్రతి ఏటా ఏప్రిల్ 15వ తేదీన ప్రపంచ కళా దినోత్సవం జరుపు కుంటారు. యునెస్కోకు అనుబంధంగా ఉన్న అంతర్జాతీయ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 2012లో ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. ఈ తేదీ ఎంపికకు ఓ ప్రత్యేకత ఉంది. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త, కళాకారుడు, ఆవిష్కర్త అయిన లియనార్డో డావించీ జన్మదినం ఇదే. కళ అనేది మానవుడి అంతఃప్రేరణకు ప్రతిరూపం. భావోద్వేగాలను, ఆలోచనలను, విశ్వదృష్టిని వ్యక్తీకరించడానికి ఇది ఓ అద్భుతమైన మాధ్యమం. ప్రతి చలనానికి, ప్రతి సాంస్కృతిక వికాసానికి కళలు మూల స్థంభాలుగా నిలుస్తాయి. చిత్రలేఖనం, కవిత్వం, శిల్పకళ, సంగీతం, నాట్యం, నాటకాలు, సినిమాలు, సాహిత్యం వంటి అనేక రూపాల్లో కళ మన జీవితంలో చొప్పించబడి ఉంది. ఈ దినోత్సవాన్ని జరపడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కళాకారుల కృషిని గుర్తించడం, ప్రజల్లో కళల పట్ల గౌరవాన్ని పెంపొందించడం, యువతలో సృజనాత్మకతను ఉత్తేజితం చేయడం లక్ష్యాలుగా ఉన్నాయి. కళలు శాంతి, సహనాన్ని, సామరస్యాన్ని పెంపొందించగలవని సందేశాన్ని ఈ సందర్భంగా ప్రపంచానికి అందిస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ దేశాల్లో కళా ప్రదర్శనలు, సదస్సులు, వర్క్‌షాప్‌లు, లైవ్ ఆర్ట్ డెమోస్, స్కూల్ కళా పోటీలు, పబ్లిక్ ఆర్ట్ ప్రాజెక్టులు నిర్వహించ బడతాయి. ఈ కార్యకమాల ద్వారా కళను సాధారణ ప్రజలకి చేరువ చేస్తారు. అంతేకాక, సామాజిక సమస్యలపై కళల ద్వారా చర్చ జరగడం ద్వారా కళల సామాజిక బాధ్యతను కూడా చాటుతారు. భారతదేశం కళలకు అనాదిగా కాణాచి. ఇక్కడి ప్రతి రాష్ట్రానికి, ప్రతి ప్రాంతానికి ప్రత్యేక కళా సంప్రదాయాలు ఉన్నాయి. భరతనాట్యం, కథక్, కూచిపూడి, మోహినియాటం వంటి నాట్యకళలు, మధుబనీ, కలమ్కారి, వార్లీ, చిరియల్ చిత్ర కళలు; అజంతా?ఎలోరా లాంటి శిల్పకళా ధృశ్యాలు ? ఇవన్నీ భారత సాంస్కృతిక సంపదకు నిదర్శనాలు. ఇటువంటి రోజుల్లో మన సంప్రదాయ కళలను సజీవంగా ఉంచడం అత్యవసరం. డిజిటల్ యుగంలో కొత్త కళా రూపాలు వెలుగులోకి వస్తున్నాయి. డిజిటల్ పెయింటింగ్స్, 3డి ఆర్ట్, వీడియో ఆర్ట్, కంఫెపోరరీ డాన్స్ వంటి రూపాల్లో నేటి యువత కళలను వ్యక్తీకరిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా వారి ప్రతిభ ప్రపంచం దృష్టికి వస్తోంది. అయితే, ఆధునికతను అంగీకరిస్తూనే సంప్రదాయ కళలను గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉంది. సంక్షిప్తంగా చెప్పాలంటే, ప్రపంచ కళా దినోత్సవం ఒక అవకాశం ? మనలోని సృజనాత్మకతను పునరావిష్కరించుకునే, కళల పట్ల గౌరవాన్ని వ్యక్తీకరించే, కళల ద్వారా మానవత్వాన్ని వృద్ధి చేసే అవకాశం. ప్రతి ఒక్కరూ ఏదో ఒక రూపంలో కళను అనుభవించాలి, కళాకారులను ప్రోత్సహించాలి. అదే ఈ దినోత్సవానికి నిగూఢమైన అర్థం.

# ప్రధాని నరేంద్రమోదీకి సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ

లోక్ సభ నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. లోక్ సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో నియోజకవర్గాల పునర్విభజనను ముడిపెట్టవద్దని కోరారు. ఈ లేఖలో ఆయన మూడు అంశాలను ప్రస్తావించారు. మహిళా బిల్లుకు సంపూర్ణ మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు, చిన్నరాష్ట్రాలకు అన్యాయం జరిగేలా నియోజకవర్గాల పెంపు ఉందంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. చివరగా మహిళా బిల్లుకు, పునర్విభజన బిల్లుకు లంకె పెట్టవద్దని కోరారు.

లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. నియోజకవర్గాల పెంపు వంటి కీలక నిర్ణయాలు తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఇందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని అన్నారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాల పునర్విభజన చేపడితే జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని అన్నారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గకుండా చూడాలని ప్రధానిని కోరారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాట కార్యాచరణ

- మొదటి పేజి తరువాయి

ఏప్రిల్ 20న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అధినేత కేసీఆర్ హాజరుకానున్నారని కేటీఆర్ తెలిపారు. అనంతరం ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. మే, జూన్ నెలల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలపై తొలుత దృష్టి సారించబోతున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. ఏయే ప్రాంతాల్లో ఏయే హామీలు ఇచ్చారో, తిరిగి అదే ప్రాంతాల్లో సభలు పెట్టి ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయాల కోసమే వాడుకుందని మండిపడ్డారు. అంబేద్కర్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవడమే కాకుండా, ఆయనకు భారతరత్న ఇవ్వడంలోనూ, పార్లమెంటులో ఫొటో పెట్టడంలోనూ కాంగ్రెస్ నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించకుండా గేట్లు వేస్తే, తాము హెచ్చరించిన తర్వాతే గేట్లు తెరుచుకున్నాయని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీలు మోసపోయారని, వెయ్యికి పైగా గురుకులాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ అరాచక పాలనపై బీఆర్ఎస్ గట్టిగా నిలదీస్తుందని అన్నారు.

# ఆర్టీసీలో సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- మొదటి పేజి తరువాయి

ఉందని స్పష్టం చేశారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాలకు సంబంధించిన అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని.. ఈ రెండు అంశాలు తప్ప మిగతా సమస్యలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఇటీవలే ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ అమలులోకి తీసుకువచ్చామని.. ప్రస్తుతం ఎలాంటి డీఏ బకాయిలు పెండింగ్‌లో లేవన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ అంశం కూడా ఆలోచిస్తున్నామని తెలిపారు. సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు.

# మోదీకి ట్రంప్ ఫోన్...

## 40 నిమిషాల పాటు సంభాషణ

ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాదాపు 40 నిమిషాల పాటు ఫోన్‌లో సంభాషించు కున్నారు. ఈ సంవత్సరం వీరిద్దరు ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇది మూడోసారి. పశ్చిమాసియాలో ఫిబ్రవరి 28న ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి వారిద్దరు మాట్లాడుకోవడం ఇది రెండోసారి. తాజాగా, తనకు ట్రంప్ నుంచి ఫోన్ కాల్ వచ్చిందని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు.

మిత్రుడు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి తనకు ఫోన్ కాల్ వచ్చిందని పేర్కొన్నారు. వివిధ రంగాలలో అమెరికా, భారత్ ద్వైపాక్షిక సహకారం సాధించిన గణనీయమైన పురోగతిని సమీక్షించినట్లు తెలిపారు. అన్ని రంగాల్లో ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. పశ్చిమాసియాలోని పరిస్థితులపై కూడా తమ మధ్య చర్చ జరిగిందని వెల్లడించారు. హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం, స్వేచ్ఛగా, సురక్షితంగా నిర్వహించడం ఎంత అవసరమో నొక్కి చెప్పామని మోదీ పేర్కొన్నారు.కాగా, అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలం కావడం, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమైన నేపథ్యంలో వీరిద్దరు మాట్లాడుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# బీహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి

బీహార్ తదుపరి ముఖ్యమంత్రిగా బీజేపీ నాయకుడు సామ్రాట్ చౌదరి నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీజేపీ శాసనసభా పక్షం సామ్రాట్ చౌదరిని తమ పార్టీ నేతగా ఎన్నుకుంది. దీనితో ఆయన రేపు ప్రమాణం చేయనున్నారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ ఎన్నిక కోసం పరిశీలకుడిగా వచ్చారు.

1990లో ఆర్జేడీలో సామ్రాట్ చౌదరి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1999లో వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత ఆయన జేడీయూలో చేరారు. అనంతరం ఆయన బీజేపీలో చేరగా, కొన్నాళ్లకే 2018లో బీహార్ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2023 మార్చిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు. ఇప్పుడు బీహార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మొదటి బీజేపీ నేతగా ఆయన నిలవనున్నారు. ఆయన కుష్వాహా వర్గానికి చెందిన నాయకుడు. బీహార్‌లో యాదవుల తర్వాత కుష్వాహాల ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. బీహార్‌లో ఇప్పటి వరకు ఈ వర్గానికి చెందిన నాయకుడికి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం రాలేదు. సామ్రాట్ చౌదరిని పెద్ద నాయకుడిగా చేస్తానని బీహార్ ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ క్రమంలో తొలుత ఉపముఖ్యమంత్రిగా చేశారు. రేపు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# నన్ను నమ్మండి... ఇవి మోసపూరితమైనవి కావు

- మొదటి పేజి తరువాయి

రూపంలో విడుదల చేస్తామని వెల్లడించారు. అయితే, అంతకంటే ముందే ప్రజల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో కొన్ని "ప్రాధాన్యత హామీలను" ఆయన ప్రజల ముందుంచారు. ముఖ్యంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చేనేత రంగానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చిన విజయ్, ఈ రంగానికి పలు కీలక హామీలు ప్రకటించారు.

చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లలో నేరుగా విక్రయించుకునేందుకు ప్రత్యేకంగా ఒక ఈ-కామర్స్ బ్రాండ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. చేనేత మగ్గాలు లేదా పవర్‌లూమ్‌లు ఉన్న ప్రతి కుటుంబానికి, పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, విద్యుత్ సవాళ్లను అధిగమించేందుకు ఏటా రూ. 30,000 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చేనేత యూనిట్లకు 500 యూనిట్ల వరకు, పవర్‌లూమ్‌లకు 1,500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు నూలు, రంగులపై 50 శాతం సబ్సిడీ ఇస్తామని ప్రకటించారు. ప్రతి చేనేత కార్మికుడికి రూ. 10 లక్షల జీవిత బీమా కవరేజీ కల్పిస్తామన్నారు. చేనేత కార్మికుల నెలవారీ పింఛనును రూ. 3,000కు పెంచుతామని హామీ ఇచ్చారు. చిన్న పరిశ్రమలపై విద్యుత్ టారిఫ్‌ల భారాన్ని కూడా తగ్గిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ఎంఎస్‌ఎంఈల కోసం పీక్-అవర్ విద్యుత్ ఛార్జీలను తాత్కాలికంగా నిలిపివేస్తామని, టెక్స్‌టైల్ రంగ పునరుద్ధరణకు మద్దతుగా ఐదేళ్లపాటు 100% విద్యుత్ పన్ను మినహాయింపు ఇస్తామని ప్రకటించారు. వ్యవసాయ రంగంపై దృష్టి సారిస్తూ, ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులకు పూర్తిస్థాయిలో వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని విజయ్ హామీ ఇచ్చారు. అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు 50 శాతం రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. వరి సేకరణ ధరను క్వింటాల్‌కు రూ. 3,500కు, చెరకు ధరను టన్నుకు రూ. 4,500కు పెంచుతామన్నారు. ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ. 10,000 ఆర్థిక సాయం అందిస్తామని కూడా వాగ్దానం చేశారు.

పరిపాలనాపరమైన హామీలను కూడా విజయ్ ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్లకు పైగా సర్వీసులో ఉన్న తాత్కాలిక సిబ్బందిని పర్మినెంట్ చేస్తామన్నారు. పోలీసు శాఖలో ప్రమోషన్లలో అవినీతిని నిర్మూలించి, పారదర్శక బదిలీలు చేపడతామని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బందికి జీతాల పెంపు, సంక్షేమ ఆసుపత్రులు, మహిళా అధికారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. తన హామీలన్నీ నిజాయతీతో కూడినవని, మోసపూరితమైనవి కావని ప్రజలు తనను నమ్మాలని విజయ్ కోరారు. తమిళనాడు రాజకీయాల్లో ఒక "విజిల్ విప్లవం" తీసుకురావడానికి తనకు మద్దతివ్వాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# అంబేద్కర్ అసమానతలు లేని సమాజాన్ని కోరుకున్నారు

- మొదటి పేజి తరువాయి

అంబేద్కర్ ఇచ్చిన ధైర్యంతో మనం ఈ ప్రభుత్వంపై కూడా పోరాడి పేదవారికి న్యాయం చేయాలనుకుంటున్నామని అన్నారు. ఈ భూమి మీద అంబేద్కర్ వ్యతిరకులు ఎవరైనా ఉన్నారా అంటే అది కేవలం రేవంత్ రెడ్డి మాత్రమేనని ఆరోపించారు. ప్రభుత్వానికి ఇప్పటికైనా బుద్ధి రావాలని కవిత అన్నారు.

# తెలంగాణలో మండుతున్న ఎండలు... పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

- మొదటి పేజి తరువాయి

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, హైదరాబాద్, నిర్మల్, కరీంనగర్, వనపర్తి, కొమురంభీమ్ తదితర జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో బుధవారం వడగాలులు వీచే అవకాశం ఉంది. రేపు, ఎల్లుండి ఉత్తర, దక్షిణ తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఎండ తీవ్రత 41 నుంచి 44 డిగ్రీల వరకు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, రేపు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. గురువారం నుంచి ఎండల తీవ్రత మరింత ఎక్కువ కానున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

# ఛత్తీస్‌గఢ్‌లోని పవర్ ప్లాంట్‌లో పేలుడు... 9 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

ట్యూబ్‌లో పేలుడు సంభవించడంతో 9 మంది మృతి చెందగా, 30 మందికి పైగా గాయబడినట్లు పోలీసులు తెలిపారు. మరికొందరు కార్మికులు లోపల చిక్కుకుపోయి ఉంటారని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈరోజు కార్మికులు పని చేస్తున్న సమయంలో బాయిలర్‌లో వైఫల్యం తలెత్తడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనలో పలువురు మృతి చెందారు. దీనితో వెంటనే కార్మికులు ప్లాంట్ నుంచి బయటకు పరుగెత్తే ప్రయత్నం చేయడంతో తొక్కిసలాట జరిగినట్లు చెప్పారు. దీనితో మరికొందరు గాయాలపాలయ్యారని వెల్లడించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించింది.

# నియోజకవర్గాల పునర్విభజన... 543 నుంచి 850కి పెరగనున్న లోక్ సభ స్థానాలు

- మొదటి పేజి తరువాయి

815 వరకు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశముంది. దీనితో లోక్ సభ స్థానాలు 543 నుంచి 850కి చేరవచ్చని అంచనా ఉంది. లోక్ సభలో బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసి సీట్ల పెంపు కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేసి 2029 ఎన్నికల్లో అమలు చేయాలని భావిస్తోంది.

సీట్ల పెంపు తర్వాత దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయి. జనగణన తర్వాత వచ్చిన లెక్కల ఆధారంగా రిజర్వేషన్ ఉంటుంది. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్ సభ, అసెంబ్లీ సీట్లను 50 శాతం పెంచాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్


అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్..


డి.విజయేందర్‌రెడ్డి.. మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి..

# రాజ్యాంగాన్ని రూపొందించిన శిల్పి... డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్

## మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 14:** దళితులు గిరిజనులు వెనుకబడిన కులాల వారికి హక్కులు కల్పించి సార్వభౌమాధికారాన్ని దక్కించేందుకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రూపొందించిన శిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి కొనియాడారు.. మంగళవారం ఉప్పల్‌లో జిల్లా స్థాయిలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా నివాళులు అర్పించారు.. జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ జైపాల్ రెడ్డి హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాలను పెట్టుకోవడం కాదని ఆయన రాజ్యాంగంలో పొందుపరిచిన, పలు అంశాలను ఆచరించి వారి అడుగుజాడల్లో నడవాలని అన్నారు..


ప్రేమ వివాహం చేసుకున్న పలువురికి చెక్కుల పంపిణీ..

ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు వెనుకబడిన వారికి అందించే పథకాలపై ప్రజలలో ప్రాచుర్యం కల్పించి వారికి లబ్ధి చేకూరేలా, ఆయా సంఘాల నాయకులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఎస్ కళాకారులు ఆలపించిన అంబేద్కర్ పాటలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. అనంతరం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహక చెక్కులను అదనపు కలెక్టర్ అందించారు. దళితుల అభ్యున్నతికి కృషి చేసిన వారికి దళిత రత్న అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఓ రాజేష్ కుమార్, మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాష్, ఎసిపి వెంకట్ రెడ్డి, ఉప్పల్ ఎంఆర్ఓ పూల్ సింగ్, డిఆర్డిఓ సాంబశివరావు, ఎల్డిఎం శివ ప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పద్మజా, కుల సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

### బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి ఆయన లక్ష్యం..

నేడు యావత్ భారతదేశం, ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటున్నారని అదనపు కలెక్టర్ కొనియాడారు.. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం లోని రిజర్వేషన్ల ద్వారానే సమాజంలో సమానత్వం కల్పించారన్నారు. కుల మత నిర్మూలన గావించి సమ సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగంలోని రిజర్వేషన్‌లతోనే, నేడు బడుగు బలహీన వర్గాలు కూడా రాజకీయ, వ్యాపార, ఆర్థిక రంగాలలో ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు.. సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన అందించిన రాజ్యాంగంలోని అంశాలను అమలయేలా చూడాలని అన్నారు..


అంబేద్కర్ ఆశయ సాధనలో అందరూ భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ..



- మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్‌లో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు..
- అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జ్యోతి ప్రజ్వలనం గావించి ఘనంగా నివాళు లు..
- రిజర్వేషన్లతో బడుగు బలహీన వర్గాలకు సమాన అవకాశాలు లభించాయి.. "
- కులాంతర వివాహ జంటలకు ప్రోత్సాహక చెక్కులు, దళిత రత్న అవార్డుల ప్రదానం..


జ్యోతి ప్రజ్వలన గావించిన జిల్లా అడిషనల్ కలెక్టర్, ఏసిపి వెంకట్ రెడ్డి..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పలుకుబడికి ప్రాధాన్యత..! ప్రభుత్వ భూమికి శఠగోపం..!

ప్రభుత్వ భూమిలో.. ఖరీదైన విల్లాల నిర్మాణం..
"రెవెన్యూ–మున్సిపల్" అధికారుల చేతివాటానికి ఇదో నిదర్శనం..?
తిలాపాపం తలాపిడికెడుగా.. పంచుకు తింటున్న రాకాసి మూకలు..?

- మల్లంపేట్ సర్వే నెం.170/3 లో ఆక్రమిత ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు...
- అధికారపార్టీ నేతతో చేతులు కలిపి.. రూ.కోట్లు విలువైన భూమికి ఎసరు..!
- రెండు శాఖల నిర్లక్ష్యం.. లంచావతారుల నిజస్వరూపం బట్టబయలు..
- అక్రమ కట్టడాలే లక్ష్యంగా కరప్షన్..! ప్రభుత్వ భూముల పరిరక్షణలోనూ అదేతీరు..!
- 'మై క్యూర్ సిటిజెన్ యాప్'లో నోటీసులు జారీచేశామని చెప్పిన అధికారి జాడేలేదు..
- ప్రభుత్వ భూములు కట్టబెట్టేదొకరు..! అక్రమ నిర్మాణాలు ప్రోత్సహించేది మరొకకరు..!
- ఆ 2 శాఖల పెద్దదిక్కుగా వ్యవహరించే..! అధికారులిద 'దొందు దొందే'నని నిరూపణ..?

-5 లో



## డీలిమిటేషన్.. ఎలాంటి కారణం లేకుండా రేవంత్ రాజకీయాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "భయాన్ని వ్యాప్తి చేయడం ఆపండి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ను చదవండి. అందులో "so far as practicable" అనే పదాన్ని ఉపయోగించారు. డీలిమిటేషన్ కేవలం జనాభాపైనే ఆధారపడదు. అవసరమైన ఇతర అంశాలను కూడా డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. సీట్ల పెంపు కోసం ఏ ఫార్ములాను

-4 లో

# డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు..



ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సూరారం కాలనీలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ ఓపెన్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఘనంగా పూలమాలలు వేసి వారిని స్మరించుకున్నారు.. ఈ కార్యక్రమంలో రాసమల్ల యాదగిరి మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కాటం దేవయ్య, కనుమూరి కుర్మయ్య, ప్రసాద్ బాబు, గడ్డం కుర్మయ్య, బిజెపి నాయకులు కంది శ్రీరాములు, దేవర రమేష్, సంద శివకుమార్, వల్లూరి యాదగిరి, విజయ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు..


పెన్ పవర్ న్యూస్, కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 14..



భారత రాజ్యాంగ నిర్మాత, డా. బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ యువనేత మాజీ తెలంగాణ ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. సాయికుమార్ పంతుల ఆ మహనీయుడికి పూలతో అభిషేకం చేసి, ఘనంగా నివాళులు అర్పించారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాల వద్ద పాల్గొన్న సాయికుమార్,ఘనంగా నివాళులు అర్పించారు.. ఆ మహనీయుని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని తెలిపారు.. కున్నారు.. ఈ సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ, సమానత్వం, సామాజిక న్యాయం, విద్య ప్రాముఖ్యతపై ఆయన చూపిన మార్గదర్శకతను ప్రజలు ఆచరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాను. అంబేద్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు.. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్,పెన్ పవర్ న్యూస్, ఏప్రిల్ 14:





రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు, నిజాంపేట్‌లో ఘనంగా నిర్వహించారు.. నిజాంపేట్ అంబేద్కర్ విగ్రహం వద్ద, సిపిఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్యం నుండి కుల వివక్షను అనుభవిస్తూ ఉన్నత చదువులు చదువుకొని ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన మహనీయుడు అంబేద్కర్ అంటూ కొనియాడారు. కుల నిర్మూలన కోసం తన జీవితాంతం పోరాటం చేసి సమసమాజం కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అన్నారు. ఆయన ఒక కులానికో, మతానికో చెందిన వాడు కాదని, అయన అందరి వాడని అన్నారు.. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశి. యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, అమృతమ్మ, కౌసల్య, నర్సమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు..

నిజాంపేట్, పెన్ పవర్, న్యూస్, ఏప్రిల్ 14:



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారంలోని ఎన్టీఆర్ నగర్, అంబేద్కర్ నగర్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో రావుల శేషగిరిరావు పాల్గొని మహనీయులకు ఘనంగా నివాళులు అర్పించారు.. అనంతరం సూరారం కాలనీలో అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు.. రావుల శేషగిరి, వెంట దేగల సతీష్ బాబు, రమేష్ బాబు,గురు ప్రసాద్ రావు, శ్రీనివాస్ రావు, అనిల్ రెడ్డి, రావుల పృథ్వి తదితరులు పాల్గొన్నారు..

పెన్ పవర్, జీడిమెట్ల, ఏప్రిల్ 14:



## డీలిమిటేషన్.. ఎలాంటి కారణం లేకుండా రేవంత్ రాజకీయాలు

-3 పేజి తరువాయి

అనుసరించాలనే నిర్ణయాన్ని ఆ కమిషన్‌కే వదిలారు. అయినా ఎలాంటి కారణం లేకుండా మీరు రాజకీయాలు చేస్తున్నారు.. షేమ్” అని రామచందర్‌రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు.ప్రధాని మోదీకి సీఎం రేవంత్ నేడు బహిరంగ లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. “కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలి” అని రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రామచందర్‌రావు స్పందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## మారుతి భిక్షం త్యాగాం వెలకట్టలేనిది



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 14:** నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పోరాడిన మారుతి బిక్షం త్యాగం మరువలేని దని న్యూ డెమోక్రసీ పార్టీ కార్యదర్శి గౌను భద్రయ్య అన్నారు. గార్ల మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలో మంగళవారం మారుతి భిక్షం 7వ వర్ధింతి వేడుకలను న్యూ డెమోక్రసీ మద్దివంచ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆయన స్మారక స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు తొలుత న్యూ డెమోక్రసీ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ కే మదర్ జెండా ఆవిష్కరించారు అనంతరం ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి గౌని భద్రయ్య మాట్లాడుతూ కరోనా సందర్భంలో తన ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్యక్రమంలో ముందుండి పోరాటాలు నిర్వహించాడని అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవటం బాధాకరమన్నారు నాడు కూలీల కోసం శీతాకాల హక్కుల కోసం ముందుండి పోరాడి వాళ్ళ హక్కులను సాధించాడని మారుతి బిక్షం పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేశాడని అన్నారు గతంలో దొరల భూస్వాముల దౌర్జన్యాలను వ్యతిరేకంగా పోరాడి వేటి చాకిరి వ్యతిరేకిస్తూ పార్టీ కోసం చాలా పోరాటాలు చేశారన్నారు తను నమ్మిన

పార్టీ కోసం సిద్ధాంతం కోసం తన చివరి శ్వాస వరకు పార్టీ జెండాను విడకుండా అనేక పోరాటాలు నిర్వహించిన ఆయన త్యాగాలను ముందుకు తీసుకుపోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో మద్ది వంచ మాజీ సర్పంచ్ కే బాబురావు పార్టీ నాయకులు గౌని మల్లేశం నల్లవెల్లి అప్పయ్య చిర్ర పాండురంగారావు శ్రీరాములు రంగారావు ఐలయ్య పవన్ రమేష్ శ్రీనివాస్ చోటే బాబు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్




**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 14:** అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహనీయులు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ అన్నారు. సిపిఎం, కెవిపిఎస్, సిఐటియు, ఐద్వా, తదితర సిపిఎం అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని స్థానిక నెహ్రూ సెంటర్ లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనం నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా పోరాడిన అంబేద్కర్ ఆశయాలను నేటి యువత కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగూరి.వెంకటేశ్వర్లు, అంబటి వీరస్వామి, మల్లెల నాగమణి, చింత ఎల్లయ్య, చింత మౌనిక, జి వీరభద్రం, ప్రవీణ్, సాయి, మల్లయ్య, ఇస్తారి, సర్వర్, కోటయ్య, సర్వయ్య, చందు,రమేష్, సిపిఎం అనుబంధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## నోటీసులు బేఖాతర్..!

మల్లంపేట్ సర్వే నెంబర్ 170/3 గుర్రం విజయలక్ష్మి వెంచర్ రోడ్డు నెంబర్ 10లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో, పలుకుబడి కబ్జాలు కొనసాగుతున్నాయి.. అధికారులను మేనేజ్ చేస్తూ, అక్రమార్కులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలకు, దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ అధికారి ఏసిపి శ్రీనివాస్, ఏప్రిల్-8న నోటీసులు ఇచ్చినట్టు 'మై క్యూర్ సిటిజెన్ యాప్'లో తెలిపారు.. ఇంతలోనే ఏమైందో ఏమోకానీ..! కూల్చేస్తామని ప్రగల్భాలు పలికిన మున్సిపల్ అధికారులు బేరం కుదుర్చుకున్నారా..? వారం రోజులు కూడా గడవక ముందే, గత రెండు రోజులుగా అక్రమ నిర్మాణాల్లో యధేచ్ఛగా పనులు చేస్తుంటే.. చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు..

టౌన్‌ప్లానింగ్ వ్యవస్థకే మచ్చతెచ్చే విధంగా అధికార యంత్రాంగం తయారైంది.. ఇప్పటికే దుండిగల్ సర్కిల్ వ్యాప్తంగా, అక్రమ ప్రమాదకర కట్టడాల బాగోతం చాలదన్నట్టు.. రూ.400 కోట్ల కుంభకోణానికి తెరలేపి, జైలుపాలైన, మల్లంపేట్ 'జిఎల్‌సి' వెంచర్‌లో.! అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలతో మరోసారి తమ అవినీతిని చాటుకుంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. మున్సిపల్ అధికారుల బాటలోనే, రెవెన్యూ అధికారులు తానా తందానా అంటూ, ప్రభుత్వ భూముల పరిరక్షణ గాలికొ వదిలేశారని స్పష్టమవుతుంది..! రెండు శాఖల సహకారంతోనే నిర్మితమవుతున్న మల్లంపేట్ 'జిఎల్‌సి'లో, ఓవైపు ఆక్రమిత ప్రభుత్వ అసైన్డ్ భూమి- మరోవైపు అనుమతుల్లేని అక్రమ విల్లాల నిర్మాణాలు.. మున్సిపల్ అధికారుల చేతివాటాన్ని ప్రదర్శిస్తుంది..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 14:




మల్లంపేట్ సర్వే నెంబర్ 170/3 ప్రభుత్వ భూమిలో డూప్లెక్స్ నిర్మాణం..

# పలుకుబడికి ప్రాధాన్యత..! ప్రభుత్వ భూమికి శఠగోపం..!

- ప్రభుత్వ భూమిలో.. ఖరీదైన విల్లాల నిర్మాణం..
- "రెవెన్యూ-మున్సిపల్" అధికారుల చేతివాటానికి ఇదో నిదర్శనం..?
- తిలాపాపం తలాపిడికెడుగా.. పంచుకు తింటున్న రాకాసి మూకలు..?

- మల్లంపేట్ సర్వే నెం.170/3 లో ఆక్రమిత ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు...
- అధికారపార్టీ నేతతో చేతులు కలిపి.. రూ.కోట్లు విలువైన భూమికి ఎసరు..!
- రెండు శాఖల నిర్లక్ష్యం.. లంచావతారుల నిజస్వరూపం బట్టబయలు..
- అక్రమ కట్టడాలే లక్ష్యంగా కరప్షన్..! ప్రభుత్వ భూముల పరిరక్షణలోనూ అదేతీరు..!
- 'మై క్యూర్ సిటిజెన్ యాప్'లో నోటీసులు జారీచేశామని చెప్పిన అధికారి జాడేలేదు..
- ప్రభుత్వ భూములు కట్టబెట్టేదొకరు..! అక్రమ నిర్మాణాలు ప్రోత్సహించేది మరొకకరు..!
- ఆ 2 శాఖల పెద్దదిక్కుగా వ్యవహరించే..! అధికారులిద 'దొందు దొందే'నని నిరూపణ..?





View Comments

| | |
|---|---|
| Posted by | E. SRINIVASU |
| Mobile No | 7013647527 |
| ID | 13491992 |
| Remarks | notice issued action will be taken as per rules |
| Status | Attended By Officer |
| Time stamp | 08-APR-2026 16:50:05 |

JPG

| | |
|---|---|
| Posted by | Krishna |
| Mobile No | 6303954818 |
| ID | 13491918 |
| Remarks | Not attended |
| Status | Open |
| Time stamp | 08-APR-2026 16:41:33 |

JPG

మేడ్చల్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం అలసత్వం ఏమేరకు ఉందో..! దుండిగల్ గండిమైసమ్మ మండలం బౌరంపేట్ సర్వే నెంబర్ 166/1లో సుమారు రూ.150 కోట్లు విలువైన ప్రభుత్వ భూమికి చెందిన వ్యవహారంతో బట్టబయలు అయింది.. ఇప్పుడు అదే దుండిగల్ మండలం మల్లంపేట్ సర్వే నెం.170/3లో అదనంగా ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూమి విషయంలోనూ రెవెన్యూ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి..! దుండిగల్ సర్కిల్ అధికారులు కూడా, అంతకు మించి బరితెగింపు విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.. గుర్రం విజయలక్ష్మి కన్‌స్ట్రక్షన్‌లోని, మూడు సర్వే నెంబర్‌లలో, అదనంగా ఆక్రమణలో ఉన్న అసైన్డ్ భూమి, 5 ఎకరాల పైచిలుకు, ఉంటుంది.. దాని విలువ దాదాపు రూ.100 కోట్లు విలువైన ప్రభుత్వ భూమిలో, అక్రమంగా విల్లాలు నిర్మిస్తుంటే..! టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఒక్కో వ్యక్తికి, ఒక్కో సమాధానం, అధికారుల వక్రబుద్ధిని బట్టబయలు చేస్తోంది..

### విడతల వారిగా ముడుపులు..? అదే తీరుగా పనులు..?

మల్లంపేట్ ' జిఎల్‌సి'లో అక్రమ నిర్మాణాలకు దుండిగల్ సర్కిల్ అధికారులు ఒప్పందం ప్రకారం, తమవంతుగా సహకారం అందిస్తున్నారని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు.. మున్సిపల్ అధికారుల తీరుపై స్థానికుల మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. అక్రమార్కుల ముడుపులు విడతల వారిగా అధికారులకు చేరుతున్న ప్రకారమే..? అక్రమ కట్టడంలో పనులు కూడా అదేవిధంగా జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకునే తీరులో, ఓ అధికారపార్టీ నాయకుడు వ్యవహరించి సిఫార్సులు చేస్తుంటే..? అధికారులు తమ లాభాపేక్ష కోసం, అక్రమ కట్టడాలకి అండగా నిలుస్తున్నారని స్థానికులు చెబుతున్నారు..


మంగళవారం పనులు చేస్తున్న కార్మికులు..


పెన్ పవర్
ప్రభుత్వ భూమిలో..! పలుకుబడి కబ్జాలు..!



నోటీసులు ఇచ్చినా, యధావిధిగా నిర్మాణ పనులు..

# మున్నేరు పాలేరు లింక్ కెనాల్ ఆన్లైన్ సర్వే ప్రారంభం

**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 14:** మున్నేరు పాలేరు లింకు కెనాల్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం గార్ల మండల కేంద్రంలో చేపట్టిన స్ట్రా పోల్ ఇంటర్నేషనల్ ఆన్ లైన్ సర్వేను తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల ప్రారంభించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన నీరు మన భూమి మన హక్కు మన మున్నేరు అని మున్నేరును కాపాడుకోవాలని మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలందరూ ఈ సర్వేలో పాల్గొని మున్నేరు బిడ్డలకు అండగా నిలవాలని విశ్వ జంపాల విజ్ఞప్తి చేశారు.దశాబ్దాలుగా మన సాగునీటి కలలను సాకారం చేయాల్సిన పాలకులు, నేడు మన నోటి కాడి కూడును లాగేస్తూ, 'మున్నేరు పాలేరు లింక్ కెనాల్' (జీవో నంబర్ 98పేరుతో మున్నేరు నీళ్ళను పాలేరుకు తరలించడానికి ప్రయత్నిస్తూ మున్నేరు జల దోపిడీకి తెరలేపారు. మన భూములను నాశనం చేస్తూ, మన నీటిని తరలిస్తూ, రాజ్యాంగం కల్పించిన పెసా (గ్రాజుగూగ) చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని లింక్ కెనాల్ రద్దు చేయాలి– మున్నేరు రిజర్వాయర్ నిర్మించాలి! మున్నేరు పరీవాహక ప్రాంతంలోని 60 వేల ఎకరాలకు సాగు నీరు, ప్రజలకు త్రాగు నీరు అందించాలి. ప్రజాభిప్రాయం లేని లింకు కెనాల్ నేటి పాలకుల స్వార్థానికి సాక్ష్యం! ఈ అన్యాయాన్ని ఎదిరిద్దాం.. మన హక్కులను కాపాడుకుందాం! మున్నేరు తీరాన జన హోరు జాతరై మున్నేరు పోరు కేరటమై గర్జించండీ నయవంచక పాలకులను ఎదిరించి మున్నేరును కాపాడుకోవాల్సిన అవసరం మన మీద ఉందన్నారు నేటి పాలకుల స్వార్థానికి పుట్టిన "మున్నేరు పాలేరు లింక్ కెనాల్" రద్దు చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆన్ లైన్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, రైతులు, రైతు కూలీలు, విద్యావంతులు, మేధావులు, వ్యాపారస్తులు, వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అందరూ ఈ సర్వేలో పాల్గొని ఈ సర్వే లింక్ క్లిక్ చేసి మీ పేరు నమోదు చేసుకొని "అవును" అని పేర్కొంటూ మున్నేరు పాలేరు లింక్ కెనాల్ రద్దు చేయాలని మీ అభిప్రాయాన్ని నమోదు చేసి మున్నేరు పోరాట బిడ్డలకు అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ సర్వే తేది. 14.04.2026 నుండి తేది. 30.04.2026 వరకు కొనసాగుతుందని విశ్వ తెలపారు



ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, బిఆర్ఎస్ గార్ల మండల అధ్యక్షులు మున్నేరు జల సాధన కమిటీ కన్వీనర్ గంగావత్ లక్ష్మణ్ నాయక్, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, సామాజిక విశ్లేషకులు కందునూరు ఈశ్వర్ లింగం తదితరులు పాల్గొన్నారు.

# ఆలయం వద్దనే చోరీ కేసు నమోదు



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 14:** గార్ల మండల పరిధిలోని పుల్లూరు గ్రామ సమీపంలోని శివాలయంలో చోరీ జరిగినట్లు ఆలయ పూజారి మద్దోజు విశ్వనాథం ఆచార్య ఫోన్ ద్వారా పోలీస్ స్టేషన్ అంధించిన సమాచారం మేరకు ఎస్సై బి. సాయికుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈనెల 11న గుర్తుతెలియని దొంగలు శివాలయంలోకి చొరబడి సుమారు 8 వేల రూపాయల విలువగల వస్తువులను దొంగిలించినట్లు ఆలయ పూజారి తెలిపిన వివరాల ప్రకారం ఆలయం వద్దనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, ఎఫ్ఐఆర్ కాపీని పూజారికి అందించినట్లు ఎస్సై తెలిపారు.

# మహా దార్శనికుడు భీంరావ్ అంబేద్కర్



ఖమ్మం, రూరల్ పెన్ పవర్, ఏప్రిల్ 14: దీన జన బాంధవుడు, మహా దార్శనికుడు, భారత రాజ్యంగ రచయిత డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేడ్కర్ అని మున్సిపల్ కమిషనర్ మునీర్ ఆలీ అన్నారు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఏదిలాపురం మున్సిపాలిటీ చైర్మన్ పోకబత్తిని అనిత ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు సందర్భంగా వారు మాట్లాడుతూఅంబేద్కర్ జయంతి భారతరత్న , రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మన దేశంలో పుట్టడం మన అందరి అదృష్టమన్నారు. ప్రపంచంలోని మహనీయుల జాబితాలో అగ్రగణ్యుడుగా అంబేద్కర్ద

ఉన్నారన్నారు. అంబేద్కర్ ఆలోచనలకు, ఆశయాలకు అనుగుణంగా సమసమాజ స్థాపనకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి కౌన్సిలర్ సోమ వెంకటరెడ్డి బానోతు దివ్య స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ దళం రివర్స్ గేర్

## బీఆర్ఎస్ పార్టీ పేరు మార్చే ఆలోచనలో కేసీఆర్..?




**హైదరాబాద్: పెన్ పవర్:** బీఆర్ఎస్ పార్టీ మళ్లీ టీఆర్ఎస్గా మారుతుందా అనే అంశం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. వరుస ఎన్నికల్లో ఎదురైన పరాజయాలు, పార్టీ కేడర్ నుంచి వస్తున్న ఒత్తిడి నేపథ్యంలో అధిష్టానం కీలక నిర్ణయం తీసుకునే దిశగా కదులుతోందనే ప్రచారం వేగంగా విస్తరిస్తోంది. టీఆర్ఎస్ అనే పేరుతోనే ప్రజల్లో బలమైన గుర్తింపు ఏర్పడిందని, ఆ పేరును మార్చిన తర్వాతే పార్టీకి గడ్డుకాలం మొదలైందనే అభిప్రాయం పలువురు నేతలు బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాబోయే ఎన్నికల్లో తిరిగి బలపడాలంటే పాత పేరుకే మళ్లాలని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**2001లో**

కేసీఆర్ తెలంగాణ ఉద్యమ లక్ష్యంతో పార్టీని స్థాపించిన తర్వాత టీఆర్ఎస్ పేరు ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. నీళ్లు, నిధులు, నియామకాల వంటి అంశాలతో ప్రజల్లో సెంటిమెంట్ను పెంచుకున్న ఆ పార్టీ, తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014, 2018 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించి అధికారాన్ని నిలబెట్టుకుంది. టీఆర్ఎస్ అంటే తెలంగాణ, తెలంగాణ అంటే టీఆర్ఎస్ అనే స్థాయిలో ఆ బ్రాండ్ గుర్తింపు ఏర్పడింది. అయితే 2022 డిసెంబర్ 9న పార్టీ పేరును బీఆర్ఎస్గా మార్చుతూ జాతీయ రాజకీయాల్లో అడుగుపెట్టాలనే లక్ష్యంతో కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా విస్తరించాలనే ఉద్దేశంతో పలు రాష్ట్రాల్లో పర్యటనలు చేసి రైతు అజెండాను ముందుకు తెచ్చారు. అయితే ఈ మార్పు తర్వాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారాన్ని కోల్పోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కకపోవడం వంటి పరిణామాలు పార్టీని వెనక్కి నెట్టాయి. ఉపఎన్నికల్లో కూడా ఆశించిన ఫలితాలు రాకపోవడం, కేడర్లో అసంతృప్తి పెరగడం గమనార్హం. బీఆర్ఎస్గా మారిన తర్వాత తెలంగాణ సెంటిమెంట్ దూరమైందని, ప్రజలు పార్టీ నుంచి దూరమయ్యారనే అభిప్రాయం బలపడుతోంది. గులాబీ జెండా, టీఆర్ఎస్ పేరుతో ఉన్న అనుబంధాన్ని

కోల్పోవడం రాజకీయంగా నష్టమేనని పార్టీ లోపలే చర్చ జరుగుతోంది. ఇక పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ చర్చను మరింత వేడెక్కించాయి. మంచిర్యాల జిల్లాలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పేరు మార్పుపై కేడర్ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో ఎప్పుడూ ఈ అంశంపై మాట్లాడని ఆయన ఇప్పుడు స్పందించడం వెనుక వ్యూహం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీని తిరిగి టీఆర్ఎస్గా మార్చితే జాతీయ రాజకీయాల నుంచి కొంత దూరం కావాల్సి వస్తుందని, రాష్ట్ర రాజకీయాలపైనే దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవల చోటుచేసుకున్న వివిధ పరిణామాలు కూడా పార్టీకి ప్రతికూలంగా మారాయి. అగ్ని ప్రమాదాలు, అకాల వర్షాలు, పలు వివాదాలు, నిరుద్యోగ సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై వచ్చిన విమర్శలు ప్రజల్లో వ్యతిరేకతను పెంచాయి. ఎన్నికల్లో వరుస పరాజయాలు పార్టీపై ప్రభావం చూపించాయి. జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలని

చేసిన ప్రయత్నాలు కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో పార్టీ భవిష్యత్తుపై కీలక నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో కవిత కొత్త పార్టీ స్థాపనకుసిద్ధమవుతున్నారనే ప్రచారం కూడా రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తోంది. ఈ నెల 25న పార్టీని ప్రకటించే అవకాశముందని సమాచారం రావడంతో బీఆర్ఎస్ కేడర్లో కొత్త చర్చ మొదలైంది. ఒకవైపు కొత్త పార్టీ ప్రభావం, మరోవైపు ఇప్పటికే ఉన్న అసంతృప్తి మధ్య పార్టీ పేరు మార్పు అంశాన్ని ముందుకు తెచ్చారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కేడర్ దృష్టి మరల్చేందుకు లేదా ఐక్యతను కాపాడేందుకు ఈ వ్యూహం ఉపయోగపడుతుందా అనే కోణంలో కూడా విశ్లేషణ జరుగుతోంది. మొత్తానికి బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్గా మారుతుందా లేదా అనే ప్రశ్నకు సమాధానం పార్టీ అధినేత తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంది. పేరు మార్పు ద్వారా పాత వైభవాన్ని తిరిగి సాధించగలదా? లేక ఇది కేవలం వ్యూహాత్మక చర్చగానే మిగిలిపోతుందా? అన్నది రాబోయే రోజుల్లో స్పష్టతకు రానుంది.

# ప్రమాదాల నివారణకు సూచిక బోర్డుల ఏర్పాటు







**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 14:** గార్ల మండల వ్యాప్తంగా రహదారి ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా ముందుకెళు_న్నామని ఎస్సై సాయికుమార్ అన్నారు గతంలో రహదారులపై పలు చోట్ల వేగ నిరోధకాలు నిర్మించి ప్రమాదాలు నివారించినప్పటికీ మూల మలుపుల వద్ద సూచిక బోర్డు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతుండడంతో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా గార్ల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోడ్లపై ప్రమాదాలు జరిగే అవకాశాలున్న ముల్కనూర్ సత్యనారాయణపురం సీతంపేటపలుచోట్ల సూచికల బోర్డులను ఏర్పాటు చేయించారు. వాహనదారులను అప్రమత్తం చేసేందుకు ట్రాఫిక్ బారీ గేట్లను ఉంచారు ప్రధాన మూల మలుపులు వంతెనల వద్ద రంబుల్ స్ట్రిప్స్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆయన కోరారు రహదారి ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు నిబంధనలు పాటించాలని మద్యం మత్తులో, నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దని ఎస్సై సాయికుమార్ వాహనదారులకు సూచించారు కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పండుగలా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 14:** బడుగు బలహీన వర్గాల హక్కులకు దారి చూపిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి నాయక్ ఎస్ఐ సాయికుమార్ లు అన్నారు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు గార్ల మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సమానత్వం కోసం లింగ వర్ణ బేధాలు లేకుండా ప్రభుత్వ ఫలాలు అందరికీ చెందాలని సామాజికంగా ఆర్థికంగా అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగాన్ని రచించి బంగారు బాటలు వేసిన గొప్ప మానవతావాది బిఆర్ అంబేద్కర్ అని నేటికీ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారమే దేశం నడుస్తోందన్నారు విద్యార్థి దశ నుంచే





కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాబా సాహెబ్ అని ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు తొలుత అంబేద్కర్ చేసిన కృషిని నినదిస్తూ గార్ల పట్టణ పురవీధులలో అంబేద్కర్ చిత్రపటం తో భారీ ర్యాలీ చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జరీనా బేగం వార్డు నెంబర్ సలగం నీలావతి కార్యదర్శి బుర్ర రమేష్ గులగట్టు బాబు.డాక్టర్ హనుమంతరావు గంగుల చిన్న వెంకటేశ్వర్లు శంకర్ బుజ్జిబాబు వెంకట్ రెడ్డి కట్టెబోయిన శ్రీనివాస్ కందునూరి శ్రీనివాస్ కృష్ణ గౌడ్ మండ రాము భూక్య నాగేశ్వరరావు శ్రీనివాస్ ఇస్తారి మధు గిన్నారపు మురళి తారక రామారావు వజ్రం నాగేశ్వరరావు జంపాల విశ్వ సిరిపంగి నాగేశ్వరరావు బుడాన్ సంపసాల వెంకటేశ్వర్లు పలు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నర్వ తహసీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**మక్తల్, ఏప్రిల్ 14 పెన్ పవర్:** నర్వ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని, ఆయన కల్పించిన రాజ్యాంగ ఫలాలు నేడు అందరికీ అందుతున్నాయని సిబ్బంది కొనియాడారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# దోషాలను హరించే ప్రదోష వ్రతం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రదోషమంటే అది ఒక కాల విశేషము. దోషాలను హరించే ప్రశస్తమైన కాలాన్ని ప్రదోషకాలం అంటారు. ప్రదోషమంటే పాప నిర్మూలన అని అర్థము. ప్రతిరోజూ సూర్యాస్తమయ సమయములో చంద్రుడి కదలికల వలన ఏర్పడునది ప్రదోషము."ప్రదోషో రజనీ ముఖం" అంటారు. అంటే ప్రదోషకాలం రాత్రికి ప్రారంభం వంటిది. ఈ సమయం లో పరమశివుడు పార్వతీదేవితో కలిసి అర్ధనారీశ్వర రూపంగా దర్శనమిస్తాడు. చంద్రుడి గతి వలన, ఏర్పడే తిథుల సంధులలో సూర్యాస్తమయము అయితే, అప్పుడు ప్రదోషము అంటారు. త్రయోదశినాడు కలిగే ప్రదోషాన్ని 'మహా ప్రదోషం' అంటారు.ప్రదోష సమయం రోజు వస్తున్న త్రయోదశి నాడు వచ్చే ప్రదోష సమయం చాలా పవిత్రమైనది. త్రయోదశి వ్రతం శివుడు ప్రధాన దేవునిగా ఆచరించే వ్రతం. త్రయోదశి నాడు చేస్తారు కనుక త్రయోదశి వ్రతం అని, శివపూజ, రాత్రి భోజనం చేయడం వల్ల ప్రదోష వ్రతం అని అంటారు. త్రయోదశి వ్రతం ఆచరించడం వల్ల మహాశివుడు ప్రసన్నం అవుతాడు. సకల సుఖాలు, సర్వ సంపదల కోసం ఈ వ్రతం చేస్తారు. ప్రదోషం అంటే దోషాలను తొలగించేది అని అర్థం. ప్రతి రోజూ సూర్యాస్తమయ కాలంలో దాదాపు ఆరు ఘడియల అంటే రెండు గంటల 24 నిమిషాల సమయాన్ని ప్రదోష కాలంగా పరిగణిస్తారు. ప్రదోష కాలములో త్రయోదశి తిథి ఉంటే దానిని మహా ప్రదోషం అంటారు. మహా ప్రదోషం రోజున శివ భక్తులు ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారుస్కంద పురాణంలో ప్రదోష మహత్య కథ కూడా వివరింప బడింది. రెండు త్రయోదశి తిథులలో (శుక్ల పక్షము/ కృష్ణ పక్షము) ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారు. కొన్ని ప్రాంతాలలో మాత్రం కేవలం కృష్ణ పక్ష ప్రదోషం రోజును మాత్రమే పాటిస్తారు. అన్ని పూజలు, వ్రతాల వలె త్రయోదశి వ్రతాన్ని ఉదయం వేళ కాకుండా, సూర్యాస్తమయం నుండి రాత్రి రెండు ఘడియల లోపు ఈ పూజ చేస్తారు. ఏ నెలలో అయినా త్రయోదశి నాడు ఈ వ్రతం చేసుకోవచ్చు. అయితే ఇది సుదీర్ఘకాలంపాటు చేయాల్సిన వ్రతం. ప్రతినెలలో వచ్చే రెండు త్రయోదశుల్లోనూ త్రయోదశి వ్రతం చేయాలి. అలా 11 సంవత్సరాల పాటు ఆచరించాలి. ఏదయినా ఆటంకం వచ్చి మధ్యలో చేయలేకపోతే ఉద్యాపన చేసి ప్రతిమను విసర్జించవచ్చు.ప్రదోషకాలంలో పరమేశ్వరుడు ఏకకాలంలో రెండు రూపాల్ని ప్రదర్శిస్తూ ఎడమభాగాన పార్వతి రెండవ భాగమున పరమేశ్వర రూపంగా "అర్ధనారీశ్వరుడుగా" దర్శనమిచ్చేకాలం. ప్రదోష సమయంలో శివుడు అర్ధనారీశ్వర రూపంలో ఆనంద తాండవ నృత్యం చేస్తాడని నృత్యరత్నావళి లో చెప్పబడింది. ప్రదోష సమయంలో సమస్త దేవతలందరూ శివుడిని అర్చిస్తారని భావిస్తారు. ప్రదోష సమయంలో చేసే శివారాధన ఉత్తమమని చెప్పబడుతుంది. ఈ సమయంలో శివారాధన చేయటాన్ని సమస్త దేవతలను పూజించటంతో సమానంగా భావిస్తారు. మహాశివుడు అభిషేక ప్రియుడు కనుక మంత్రోక్తంగా పంచామృతాలతో ఆయనను అభిషేకించాలి. వీలు పడని వారు ఆలయానికి వెళ్ళి ప్రదోష సమయం లో అభిషేకం చేయించవచ్చు.ప్రదోషకాలం లో శివప్రదోష స్తోత్రాన్ని పఠించడం వలన విశేష ఫలితాలు పొందవచ్చు.ప్రదోష సమయంలో శివాలయాలలో జరిగే అభిషేకాలను దర్శించే వారికి సకల సంపదలు సిద్ధిస్తాయని భావిస్తారు. ఈ సమయంలో శివుడితో పాటు నందీశ్వరుడిని కూడా ఆరాధిస్తారు. నందీశ్వరుడు నాలుగు వేదాలు, 64 కళలను అభ్యసించిన నిష్ణాతుడైనప్పటికీ, వినయంతో వుండి, శివునికి ఏర్పడిన అనుమానాలను కూడా నివృత్తి చేస్తాడని విశ్వసిస్తారు. అందువల్ల నందీశ్వరుడిని ఆరాధించడం వలన బుద్ధికుశలత, మానసిక ఉల్లాసం లభిస్తాయి. త్రయోదశి తిథి ఆదివారం రోజు వస్తే దానిని రవి ప్రదోషం అని, సోమవారం రోజు వస్తే దానిని సోమ ప్రదోషమనీ, మంగళవారం రోజు వస్తే దానిని భౌమ ప్రదోషమని, బుధవారం రోజు వస్తే దానిని బుధ ప్రదోషమని, గురువారం రోజు వస్తే దానిని గురు ప్రదోషమని, శుక్రవారం రోజు వస్తే దానిని శుక్ర ప్రదోషమని, శనివారం రోజు వస్తే దానిని శని త్రయోదశి అనీ, శని ప్రదోషమని పిలుస్తారు. దేవ దానవులు క్షీర సాగరాన్ని మథించినప్పుడు వెలువడిన హాలాహలం నుండి శివుడు ప్రపంచాన్ని రక్షించిన రోజుగా శనిప్రదోషం రోజును చెబుతారు. శని కర్మకారకుడు, శివుడు సంహార కారకుడు కావున శని ప్రదోష సమయాన శివారాధన చేయడం ఉత్తమంగా పరిగణిస్తారు. సోమవారం శివుడికి ప్రీతికరమైనది. కాబట్టి ఆ రోజున వచ్చే సోమ ప్రదోషమును ప్రశస్తమైనదిగా భావిస్తారు. ఈ రోజున ప్రదోష వ్రతము ఆచరించటం వలన మనసులోని మలినాలన్నీ తొలగిపోతాయి .త్రయోదశీ ప్రదోషము గురువారం వస్తే ఆ రోజును గురు త్రయోదశిగా భావిస్తారు. గురు ప్రదోష పూజ వలన విద్యాబుద్ధులు, సంపదలు కలుగుతాయని చెబుతారు. జాతకములో ఉండే గురు దోషములకు రుద్రారాధన విరుగుడుగా భావిస్తారు. ప్రదోషం రోజు ఉదయమే స్నానం చేసి తెల్లని వస్త్రాలను ధరించి, శరీరంపై విభూతిని, రుద్రాక్షమాలను కూడా ధరించటం మంచిది. ఆ రోజులో వీలైనప్పుడల్లా పంచాక్షరి మంత్రాన్ని (ఓ నమ:శివాయ) జపం చేయాలి. ప్రదోషం రోజున నిశ్శబ్దంగా ఆరాధించటాన్ని శివుడు ఇష్టపడతాడని చెబుతారు. కఠిన ఉపవాసం చేయలేనివారు పండ్లు, పాలు లాంటివి తీసుకోవచ్చు. ఉడికించిన పదార్థాలను తీసుకోకూడదు. సాయంకాలం ప్రదోష సమయంలో స్నానమాచరించి శివ షోడశోపచార పూజ జరపాలి. ప్రదోషం రోజు ఆ పరమ శివుడికి నేతి దీపారాధన, ఆవుపాలతో అభిషేకం అభిషేకం చేయటం, బిల్వ పత్రాలు మరియు శంఖుపూలతో అర్చించటం శ్రేయస్కరం. మహా మృత్యుంజయ మంత్రాన్ని ...ఓం త్రయంబకం యజామహే, సుగంధిం పుష్టి వర్ధనం, ఊర్వారుకమివ బంధనాత్, మృత్యోర్ముక్షీయ మామృతాత్....మహా మృత్యుంజయ మంత్రము పఠించాలి.... 108 సార్లు జపించి ప్రదోష కథను వినటంగానీ చదవటం గానీ చేయాలి. ఇంటిలో పూజ ముగించిన అనంతరం శివాలయాన్ని దర్శించాలి. వీలైనవారు ప్రదోష స్తోత్రం, శివ స్తోత్రములను కూడా పఠించాలి.

# నెక్కొండ మండలంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**జనగామ, ఏప్రిల్ 14 పెన్ పవర్:** వరంగల్ జిల్లా నెక్కొండలో మంగళవారం అంబేద్కర్ జయంతి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం అంబేద్కర్ చేసిన పోరాటం, సామాజిక సంస్కరణలు, విద్యా ప్రాధాన్యతపై ఆయన చేసిన కృషిని నాయకులు కొనియాడారు.

## కొడకండ్లలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**పాలకుర్తి, ఏప్రిల్ 14 పెన్ పవర్:** జనగామ జిల్లా కొడకండ్లలోని ఎస్సీ మాల కమ్యూనిటీ హాలులో మంగళవారం అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మాల మహానాడు నాయకులు బాబాసాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం అంబేద్కర్ చేసిన పోరాటం చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పసర జంక్షన్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**ములుగు, ఏప్రిల్ 14 పెన్ పవర్:** ఉమ్మడి వరంగల్ జిల్లా, ములుగులోని పసర జంక్షన్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పసర ఎస్సై తాజుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయాలు సమాజానికి మార్గదర్శకమని, సమానత్వం, సామాజిక న్యాయం, విద్యకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, యువత, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ర్యాలీలు, నినాదాలు నిర్వహించారు. "జై భీమ్" నినాదాలతో పసర జంక్షన్ మారుమోగింది.

## జిల్లా కోర్టులో అంబేద్కర్ జయంతి



**సంగారెడ్డి, ఏప్రిల్ 14 పెన్ పవర్:** బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులోని కార్యాలయంలో డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్, కోశాధికారి మంజుల, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయాలను స్మరించుకున్నారు.

# అంబేద్కర్ 135వ జయంతి ఘనంగా నిర్వహణ




**పరకాల, ఏప్రిల్ 14 పెన్ పవర్:** మహబూబా బాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం లో అంబేద్కర్ 135వ జయంతిని అంబేద్కర్ యువజన సంఘం, ఉషోదయ వాకర్ అసోసియేషన్, కాపీ క్లబ్, మాజీ క్రీడాకారులు, వాకర్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం, ఉషోదయ వాకర్ అసోసియేషన్, కాపీ క్లబ్, మాజీ క్రీడాకారులు, వాకర్స్ ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నిజాం సామ్రాజ్య నిర్మాణ శిల్పి

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ రాజ్య చరిత్రలో అసఫ్ జాహీ వంశీయుల పాలన ఒక స్వర్ణయుగమైతే, ఆ పాలనకు వెన్నెముకగా నిలిచి, అస్థిరతలో ఉన్న రాజ్యాన్ని సుస్థిరత వైపు నడిపించిన ధీశాలి మహారాజా చందు లాల్. క్రీస్తుశకం 1766లో జన్మించి, 1845 ఏప్రిల్ 15న పరమపదించిన ఆయన జీవితం ఒక సామాన్య ఉద్యోగి నుంచి అసాధారణ రాజనీతిజ్ఞుడి వరకు సాగిన స్ఫూర్తిదాయక ప్రయాణం. నిజాం ఉల్ ముల్క్ ఆస్థానంలో కీలక బాధ్యతలు నిర్వహించిన చందు లాల్, తన రాజకీయ చతురతతో, పరిపాలనా దక్షతతో దాదాపు మూడు దశాబ్దాల పాటు దివాన్‌గా (ప్రధాన మంత్రి) వ్యవహరించి చరిత్రలో చెరగని ముద్ర వేశారు. కేవలం ఒక అధికారిగానే కాకుండా, కవిగా, కళా పోషకుడిగా, లౌకికవాదిగా ఆయన నిర్వహించిన పాత్ర బహుముఖీనమైనది. మహారాజా చందు లాల్ పూర్వీకులు ఉత్తర భారతదేశంలోని రాయ్‌బరేలీ ప్రాంతానికి చెందిన మల్హోత్రా ఖత్రీ కుటుంబీకులు. ఆయన తాత రాయ్ నానక్ రామ్ నిజాం ఉల్ ముల్క్ ఆసఫ్ జా ఎ కాలంలో దక్కన్‌కు వలస వచ్చారు. చందు లాల్ తన వృత్తి జీవితాన్ని కస్టమ్స్ శాఖలో ఒక సాధారణ ఉద్యోగిగా ప్రారంభించారు. క్రమంగా తన మేధస్సుతో, అంకితభావంతో నిజాం సికిందర్ జా దృష్టిని ఆకర్షించి, 1809లో 'పేష్కార్' (డిప్యూటీ మినిస్టర్) పదవిని అధిరోహించారు. ఆ సమయంలో దివాన్‌గా ఉన్న మునీర్ ఉల్ ముల్క్ నామమాత్రపు అధికారిగా ఉండగా, అసలు అధికారమంతా చందు లాల్ చేతుల్లోనే ఉండేది. 1832లో ఆయన అధికారికంగా దివాన్ బాధ్యతలు స్వీకరించి 1843 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఆయన పదవీ కాలం అత్యంత క్లిష్టమైన పరిస్థితులతో కూడుకున్నది. ఒకవైపు నిజాం అంతర్గత వ్యవహారాలు, మరోవైపు ఈస్ట్ ఇండియా కంపెనీ పెరుగుతున్న ఆధిపత్యం మధ్య రాజ్య స్వయంప్రతిపత్తిని కాపాడటం ఆయనకు కత్తిమీద సాములా మారింది. ఆర్థికంగా కునారిల్లిన రాజ్యాన్ని గట్టెక్కించడానికి ఆయన అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ముఖ్యంగా 'తాలూక్ దారీ' వ్యవస్థ ద్వారా భూమి శిస్తు వసూళ్లను క్రమబద్ధీకరించారు. అయితే, బ్రిటిష్ సైన్యం (హైదరాబాద్ కంటెంజెంట్) ఖర్చులు భరించడం వల్ల రాజ్యం తీవ్రమైన అప్పుల కూబిలో చిక్కుకుంది. పామర్ అండ్ కో వంటి బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవడం, అధిక వడ్డీలు చెల్లించడం వంటి పరిణామాలు రాజ్య ఆర్థిక స్థితిని దెబ్బతీశాయి. ఈ ఆర్థిక ఒత్తిడిని అధిగమించడానికి ఆయన పన్నుల భారాన్ని పెంచాల్సి వచ్చింది, ఇది ప్రజా సామాన్యంలో కొంత అసంతృప్తికి కారణమైనప్పటికీ, పరిపాలనా యంత్రాంగం ఆగకుండా నడపడంలో ఆయన విజయం సాధించారు.

శాంతి భద్రతల విషయంలో చందు లాల్ కఠిన వైఖరిని అవలంబించారు. రాజ్యంలోని వివిధ ప్రాంతాల్లో తలెత్తిన తిరుగుబాట్లను అణచి వేయడంలో ఆయన వ్యూహకర్తగా వ్యవహరించారు. న్యాయ వ్యవస్థను వికేంద్రీకరించి, సామాన్యులకు సైతం న్యాయం చేకూరేలా 'అదాలత్'లను బలోపేతం చేశారు. హైదరాబాద్ నగర సుందరీకరణలో కూడా ఆయన పాత్ర మరువలేనిది. నాటి మొఘల్ సంస్కృతికి, దక్కన్ ఆచారాలకు మధ్య వారధిగా ఉంటూ, హిందూ-ముస్లింల మధ్య సామరస్యాన్ని పెంపొందించారు. ఆయన స్వయంగా హిందువైనప్పటికీ, నిజాం పట్ల చూపిన విశ్వాసం, ఇస్లామిక్ సంప్రదాయాల పట్ల చూపిన గౌరవం ఆయనను అందరివాడిగా నిలబెట్టాయి. 'షదాన్' అనే కలం పేరుతో ఆయన ఉర్దూ, పర్షియన్ భాషల్లో అద్భుతమైన కవిత్వం రాశారు. ఆయన ఆస్థానం నిరంతరం కవులు, పండితులు, కళాకారులతో కళకళలాడుతూ ఉండేది. భగవంతుడిపై భక్తితోపాటు, మానవతా దృక్పథం కలిగిన ఆయన, అనేక దేవాలయాలకు, మసీదులకు భారీ విరాళాలు ఇచ్చారు. ?బ్రిటిష్ వారితో ఆయనకు ఉన్న సంబంధాలు చరిత్రకారుల మధ్య చర్చనీయాంశంగా మిగిలాయి. రెసిడెంట్ హెన్రీ రస్సెల్ వంటి బ్రిటిష్ అధికారులతో ఆయన అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ఇది రాజ్య రక్షణకు అవసరమని ఆయన భావించినప్పటికీ, పరోక్షంగా బ్రిటిష్ ప్రభావం నిజాం పాలనలో పెరగడానికి దారితీసింది. 1843లో రాజ్య ఆర్థిక సంక్షోభం ముదిరిన తరుణంలో, నిజాం నశీరుద్దౌలాతో ఏర్పడిన అభిప్రాయభేదాల కారణంగా ఆయన తన పదవికి రాజీనామా చేశారు. పదవి నుంచి తప్పుకున్నాక కూడా ఆయన గౌరవం ఏమాత్రం తగ్గలేదు. మహారాజా చందు లాల్ వారసత్వం

నేటికీ హైదరాబాద్ నగరంలో సజీవంగా ఉంది. ఆయన నిర్మించిన భవనాలు, ప్రోత్సహించిన సాహిత్య ప్రక్రియలు దక్కన్ సంస్కృతిలో అంతర్భాగమయ్యాయి. ఆయన కాలంలోనే హైదరాబాద్ రాష్ట్రం ఆధునిక పరిపాలనా పద్ధతులకు పునాది వేసుకుంది. అధికార దాహం కంటే రాజ్య శ్రేయస్సు మిన్న అని నమ్మిన అరుదైన రాజకీయ నాయకుడు ఆయన. 1845లో ఆయన కన్నుమూసినప్పుడు, ఒక గొప్ప రాజనీతిజ్ఞుడిని, అంతకంటే గొప్ప మానవతావాదిని హైదరాబాద్ కోల్పోయింది. ఆయన వర్ధంతి సందర్భంగా చందు లాల్ చేసిన సేవలను స్మరించుకోవడం అంటే, హైదరాబాద్ ఘనమైన చరిత్రను, లౌకిక వారసత్వాన్ని గౌరవించడమే. ఒక సాధారణ వ్యక్తి శిఖరాగ్రానికి చేరి, దేశ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక పేజీని లిఖించుకోవడం చందు లాల్ ప్రతిభకు నిదర్శనం. నేటి పాలనా రంగంలో ఉన్నవారికి ఆయన ఆర్థిక క్రమశిక్షణ (ప్రయత్నాలు), దౌత్య నీతి, మత సామరస్యం వంటి అంశాలు నేటికీ పాఠాలుగా నిలుస్తాయి.

# కులవ్యవస్థను ధిక్కరించిన నానక్

**హైదరాబాద్ పెన్ పవర్:** పదిమంది సిక్కు గురువులలో ప్రథములు గురునానక్ దేవ్. నానక్ 1469 ఏప్రిల్ 15న పాకిస్తాన్‌లోని ప్రస్తుతం లాహోర్ సమీపంలోని తల్వాండీ గ్రామంలో (నన్కానా సాహిబ్)లో (ఇది అప్పటి ఢిల్లీ సుల్తానేట్ ప్రావిన్స్, ప్రస్తుతం ఈ ప్రదేశం నంకన్ సాహిబ్ అని పిలువ బడుతూ ఇప్పుడు పాకిస్థాన్ లో ఉంది) నానక్ దేవ్ కార్తీక పౌర్ణమి పుణ్యదినాన జన్మించారు. గురునానక్ తల్లిదండ్రులు కళ్యాణ్ చంద్ దాస్ బేడి, వీరిని కళ్యాణ్ దాస్ మెహతా మరియు మాతా త్రిప్తి అని కూడా పిలుస్తారు. హిందూ, ఇస్లామియా మత గ్రంథాలను చదివి, అవగాహన చేసుకుని, రెండు మతాలకు భిన్నమైన సిక్కు మతాన్ని స్థాపించారు. సిక్కు మతం ఏకేశ్వరోపాసక మతం. సిక్కులు ఏక్ ఓంకార్ (ఏకైక దేవుడు)ని విశ్వసిస్తారు. సిక్కుమత స్థాపకులై, ఏకేశ్వరోపాసనను ప్రబోధించి, కుల వ్యవస్థను వ్యతిరేకించారు. నానక్ దేవ్ అనంతరం ఈ గురు పరంపర కొనసాగుతున్నది. ఐదవ గురువు అర్జున్, తమకు ముందు గురువులకు దైవం అనుగ్రహించిన సూక్తులను, బోధనలను సంకలనం చేసి, "గురుగ్రంథ సాహిబ్" పవిత్ర గ్రంథ రూప కల్పన గావించారు. నానక్ తండ్రి కళ్యాణ్ చంద్‌దాస్, కలుమెహతాగా సుపరిచితులై, ప్రభుత్వంలో భూ రెవెన్యూ వ్యవహారాల గుమాస్తాగా పని చేసే హిందూ పట్వారీ. తల్లి మాతా త్రిపుర, అక్క బీబీనాన్కీ. నానక్‌దేవ్ బాల్యం నుండే ప్రశ్నించే, ఆలోచించే తత్వం కలవారు. చిరుప్రాయంలోనే మతపరమైన ఉపనయనం చేసి, జంధ్యం వేయబోగా తిరస్కరించి, అంతకంటే భగవంతుని నిజ నామాన్ని హృదయంలో ధరిస్తామని, భగవన్నామం యజ్ఞోపవీతం నూలుపోగులా తెగిపోవడం, మట్టిలో కలిసి పోవడం ఉండక, అఖండంగా రక్షణ కలిగిస్తుందనీ వాదించారు. అత్యంత చిన్న వయసునుండి అక్క బీబీనాన్కీ, తమ్మునిలో భగవంతుని జ్యోతిని చూడగా, ఈ రహస్యాన్ని ఎవరితోనూ ఆమె పంచుకోలేదు. ఆమె నానక్‌జీ తొలి శిష్యురాలిగా పేరొందారు. బాల్యంలోనే హిందూమతం లోని తాత్వికతకు ఆకర్షితులై, జీవిత రహస్యాల అన్వేషణ కోసం ఇల్లు వదలి పోయారు. ఈ క్రమంలోనే నానక్‌దేవ్ ముఖ్య తాత్వికులైన కబీర్, రవిదాస్‌లను కలుసుకున్నారు. బతాలాకు చెందిన వ్యాపారి మూల్‌చంద్ చోనా కూతురు సులేఖినిని వివాహ మాడారు. శ్రీచంద్, లక్ష్మీదాస్ అనే కుమారులు వారికి కలిగారు. 28ఏళ్ళ వయసులో నానక్ ఒక ఉదయం నది స్నానం, ధ్యానానికి వెళ్ళగా, మూడు రోజులు ఎవరికీ కన్పించలేదు. తిరిగి వచ్చి, దేవుని పవిత్రాత్మను నింపుకున్నాను అని ప్రకటించారు. అనంతరం "హిందువూ లేదు, ముస్లిమూ లేదు" అని మత సామరస్య బోధనలను వ్యాప్తి చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత నాలుగు ప్రధాన దిశల్లో టిబెట్, దక్షిణాసియాలోని పలు ప్రాంతాలు, అరేబియా, మక్కా, బాగ్దాద్, ముల్తాన్ తదితరాలలో ఉదాసీలనే పేరున భగవంతుని సందేశాన్ని ప్రబోధిస్తూ, ప్రయాణాలు సాగించారు. గురునానక్ దేవ్ ప్రకారం సిక్కు మతానికి సంబంధించి మూడు మార్గదర్శక సూత్రాలు ఉన్నాయి.

నామ్ జపన (దేవున్ని ఎప్పటికప్పుడు గుర్తు చేసుకోవడం), కిరాత్ కర్ణ (నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటం), వండ్ చకనా (మీతో ఉన్న దానిని ఇతరులతో పంచుకోవడం). ఇతరుల సంపాదనపై ఆధారపడి జీవించకూడదు. నానక్ బోధనలలో... భగవంతుడే అతి ముఖ్యమైన వాడు. దేవుడు ఒక్కడే. ఆకలితో అలమటించే వారికి అన్నం యిచ్చేవారినీ, దుస్తులేని వారికి దానం చేసే వారిని దేవుడు ప్రేమిస్తాడు. అందరూ గొప్ప పుట్టుక కలవారే. అత్యాశను జయించిన వారిని భగవంతుడు ప్రేమిస్తాడు.

పవిత్రమైన హృదయంతో అతడిని ధ్యానించడం, అతడిని ప్రశంశించడం అన్నవే ముక్తి మార్గాలు అనేవి ముఖ్యమైనవి. నానక్ జీవిత చరమాంకంలో ఉచిత ప్రసాదం లభించిన కర్తార్‌పూర్‌లో జీవించారు. తాను తీసుకునే ఆహారాన్ని కుల, మత బేధం లేకుండా పంచుకునే వారు. పొలాలలో పని చేసి జీవితం గడిపారు. కొత్త సిక్కు గురువుగా భాయ్ లెహ్నాను ప్రకటించాక సెప్టెంబర్ అక్టోబర్ 22న 1539లో తన 70వ ఏట స్వర్గప్రాప్తి పొందారు.

# తెలంగాణ తొలి శతావధాని

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ గర్వించదగిన కవి శిరశినగల్ కృష్ణమాచార్యులు. అభినవ కాళిదాసు, నైజాం రాష్ట్రాద్య శతావధాని, పండిత రత్న, ఉభయవేదాంత విద్వాన్, ఉభయ వేదాంతాచార్య, కోరుట్ల కృష్ణమాచార్యులు తదితర బిరుదాంకితులు. కృష్ణమాచార్యులు నిజామాబాద్ జిల్లా లోని మోర్తాడ్ గ్రామంలో 1905, ఆగస్టు 12 వ తేదీ క్రోధి నామ సంవత్సర, శ్రావణ శుక్ల విదియ నాడు రంగమ్మ, వేంకటా చార్య పుణ్య దంపతులకు జన్మించారు. బాల్యంలో పితా మహులైన సింగారాచార్యుల, తండ్రి గారైన వేంకటాచార్యుల వద్ద విద్యను అభ్యసించారు. తరువాత మాతామహులైన గోవిందాచార్యుల వద్ద 1914 నుండి 1921 వరకు ఏడు సంవత్సరాలు కావ్య, నాటక, అలంకార, సాహిత్య గ్రంథాలు, తిరుమంత్రార్థము, శ్రీ వచన భూషణ వ్యాఖ్యానము మొదలైన గ్రంథాలు అధ్యయనం చేశారు. ఆనంతరం వల్లంకొండలో కనకా పురం శ్రీనివాసాచార్యుల వద్ద తర్క ప్రకరణాలు, మోర్తాడులో కందో ఝల వెంకన్న వద్ద సిద్ధాంత భాగము, పిఠాపురంలో గుదిమెళ్ళ రంగాచార్య వద్ద వేదాంతమును అభ్యసించారు. ఆయన 1926 నుండి కోరుట్ల లోని ఉభయవేదాంత సంస్కృత పాఠశాలలో ఉపాధ్యాయులుగా ప్రవేశించి, ధర్మపురి, కరీంనగర్ సంస్కృత పాఠశాలలలో విధులు నిర్వర్తించి,

కోరుట్లలో ప్రధానోపా ధ్యాయులుగా పదవీవిరమణ చేశారు. పలువురు విద్యార్థులకు సంస్కృత సాహిత్యం నేర్పించారు. సంస్కృతాంధ్రాలలో 40కి పైగా గ్రంథాలను రచించారు. వీటిలో కావ్యాలు, శతకాలు, సుప్ర భాతాలు, స్తుతిగీతాలు, హరికథలు మొదలైనవి ఉన్నాయి కళాశాల అభ్యుదయం, రామానుజ చరితం, చిత్ర ప్రబంధం రత్నమాల (ఖండ కావ్యం) మనస్సందేశ కావ్యము, సంపత్కుమార సంభవ కావ్యము, గాంధీ తాత నీతిశతకము, గీతాచార్య మతప్రభావ శతకము, వెదిర వేంకటేశ్వరస్వామి సుప్రభాతము, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సుప్రభాతము, వేణుగోపాలస్వామి సుప్రభాతము, నంబులాద్రి నృసింహస్వామి సుప్రభాతము, పద్మావతీ పరిణయము (హరికథ) రుక్మిణీ కళ్యాణము (హరికథ) ముకుందమాల యామునా చార్యులవారి స్తోత్ర రత్నగీత ములు విశిష్టాద్వైతమత సంగ్రహము వేదార్థ సంగ్రహము (అనువాదం) గురువంశ కావ్యనిధి, స్వీయ కవితాను జీవనం ఆత్మకథ తదితర రచనలు చేశారు. ఆయన కోరుట్ల,

జగిత్యాల, ధర్మపురి తదితర పట్టణాలలో అష్టావ ధానాలు, శతావధానాలు చేశారు. తెలంగాణా ప్రాంతంలో మొట్టమొదటి అవధానిగా కీర్తి గడించారు. నైజాం రాష్ట్రాద్య శతావధాని, పండితరత్న, ఉభయ వేదాంత విద్వాన్, ఉభయ వేదాంతాచార్య మొదలైన బిరుదులు పొందారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు, ఢిల్లీలో జియ్యర్ స్వామి, మొదటి ప్రపంచ తెలుగు మహా సభలలో ముఖ్య మంత్రి జలగం వెంగళరావు ఘనంగా సత్కరిం చారు. శతావధాని కృష్ణమా చార్యుల రచనలపై పలువురు కాకతీయ, ఉస్మానియా యూని వర్సిటీల్లో పిహెచ్‌డిలు చేశారు.

# మంత్రులపై చంద్రబాబు ఆగ్రహం
# కేబినెట్ మార్పు చేర్పుల సమీకరణాలు

**విజయవాడ, ఏప్రిల్ 14, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులపై ప్రదర్శిస్తున్న అసహనం కేవలం పరిపాలనాపరమైన కోపమే కాకుండా, రాబోయే భారీ రాజకీయ మార్పులకు సంకేతంగా కనిపిస్తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా ఇటీవలి కేబినెట్ సమావేశంలో కేబినెట్ అజెండా మీడియాకు లీక్ అవ్వడంపై ఆయన స్పందించిన తీరు, మంత్రుల పనితీరుపై ఆయన ఇస్తున్న రేటింగ్స్.. త్వరలోనే ఏపీ మంత్రివర్గంలో మార్పుచేర్పులు ఉండబోతున్నాయనే అంచనాలను బలపరుస్తున్నాయి సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో, అజెండాలోని కీలక అంశాలు అధికారికంగా వెల్లడించక ముందే మీడియాలో రావడంపై చంద్రబాబు తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన దివంగత ఎన్టీఆర్ హయాంలో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేశారు. బడ్జెట్ వివరాలు లీక్ అయినందుకు ఎన్టీఆర్ మొత్తం మంత్రివర్గాన్నే రద్దు చేసిన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ.. గోప్యత పాటించలేని మంత్రులు ఉంటే ఎంత, లేకపోతే ఎంత అని నిలదీశారు. ఇది మంత్రులకు ఇచ్చిన ఆఖరి హెచ్చరికగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తోంది . సాధారణంగా చంద్రబాబు తన గత అనుభవాల దృష్ట్యా, ప్రభుత్వం సగం కాలం పూర్తి చేసుకునే సమయానికి మంత్రుల పనితీరుపై ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేస్తారు. ప్రస్తుతం మంత్రుల గ్రాఫ్, ప్రజల్లో వారి ఇమేజ్, శాఖలపై పట్టు వంటి అంశాలను ఆయన నిశితంగా గమనిస్తున్నారు. ఎవరైతే ఆశించిన స్థాయిలో పని చేయడం లేదో, వారిని తప్పించి కొత్త రక్తానికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. రాబోయే మూడు నాలుగు నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను



సెమీఫైనల్స్‌గా భావిస్తున్న బాబు, పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసేందుకు సమర్థులైన నేతలకు మంత్రి పదవులు ఇవ్వాలని భావిస్తున్నారు. కేబినెట్ అజెండాను కూడా ముందస్తుగా చదువుకోకుండా వస్తున్న మంత్రులపై ఆయన అసంతృప్తిగా ఉన్నారు. ఎన్నికల సమయానికి ప్రజల్లో మంచి మైలేజ్ ఉన్న నేతలతో కూడిన కొత్త టీమ్ ను రంగంలోకి దించే అవకాశం ఉంది. అజెండా కాపీలు ఎవరు లీక్ చేస్తున్నారో, ఏ మంత్రులు మీడియా ప్రతినిధులతో అతిగా సాన్నిహిత్యం నెరుపుతున్నారో తనకు తెలుసని చంద్రబాబు సంకేతాలిచ్చారు. ఇది మంత్రులలో ఒక రకమైన భయాన్ని కల్పించింది. కేవలం లీకులే కాకుండా, శాఖా పరమైన నిర్ణయాల్లో జాప్యం, కేంద్ర పథకాల అమలులో నిర్లక్ష్యం వంటివి కూడా బాబు అసహనానికి కారణమయ్యాయి. ఈసారి మంత్రివర్గ మార్పుల్లో నారా లోకేష్ మార్క్, అలాగే కూటమి ధర్మం ప్రకారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనలు కూడా కీలకం కానున్నాయి. యువ నేతలకు ప్రాధాన్యత పెంచడం, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడం ముఖ్యంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వంటి అంశాల ఆధారంగా కొత్త మంత్రుల ఎంపిక ఉండవచ్చు. పనితీరు బాలేని సీనియర్లను పార్టీ బాధ్యతలకు పరిమితం చేసి, చురుకైన వారిని కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం మెండుగా ఉంది. చంద్రబాబు సీరియస్ లుక్ వెనుక ఒక పెద్ద క్లీనింగ్ ప్రాసెస్ దాగి ఉందని అర్థమవుతోంది. పరిపాలనలో క్రమశిక్షణ తప్పితే ఎంతటి వారినైనా తప్పిస్తాననే సందేశాన్ని ఆయన బలంగా పంపారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపే లేదా రెండేళ్ల పాలన ముగిసిన వెంటనే ఏపీ కేబినెట్‌లో భారీ మార్పులు జరగడం దాదాపు ఖాయమని చెప్పవచ్చు.

# ఏపీలో కొత్తగా మరో 30 ఇండస్ట్రియల్ క్లస్టర్లు

**కడప, ఏప్రిల్ 14, పెన్ పవర్:**
ఏపీ ప్రభుత్వం మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల వెంట కొత్తగా మరో 30 ఇండస్ట్రియల్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్లాన్ చేసింది. గతంలో 20 కస్టర్లు ఏర్పాటు చేయగా.. వాటికి తోడు మరో 30 కలిపి మొత్తం 50 రానున్నాయి. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనల్ని కేంద్రానికి కూడా పంపింది. ఇప్పటికే ఆయా జిల్లాల్లో భూముల్ని కూడా గుర్తించారు అధికారులు. ఆంధ్రప్రదేశ్ మీదుగా కేంద్రం మూడు ఇండస్ట్రియల్ కారిడార్లను అభివృద్ధి చేస్తోంది. విశాఖపట్నం–చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్లు ఉన్నాయి. విశాఖపట్నం–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ మొదటి దశ పనులు ముగింపు దశకు చేరాయి. చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో నోడ్‌లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. హైదరాబద్–బెంగళూరు కారిడార్ పరిధిలోని అనంతపురం, కర్నూలు జిల్లాలో పారిశ్రామిక నోడ్‌లను అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే ఈ మూడు కారిడార్ల వెంట 20 ఇండస్ట్రియల్ కస్టర్లను ప్రభుత్వం అభివృద్ధం చేసింది. వీటితో పాటుగా మరో 30 క్లస్టర్లను అభివృద్ధి చేయాలని టార్గెట్ పెట్టుకుంది. ఈ మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల వెంట 30 ఇండస్ట్రియల్ కస్లర్టలను అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న 20 క్లస్టర్లకు ఈ 30 కలిపితే 50 క్లస్టర్లు అందుబాటులోకి వస్తాయని చెబుతున్నారు. కొత్తగా తెరపైకి తీసుకొచ్చిన ఈ 30 క్లస్టర్ల కోసం అధికారులు దాదాపు 1.31 లక్షల ఎకరాల భూమిని కూడా గుర్తించినట్లు తెలుస్తోంది. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన క్లస్టర్లు.. శ్రీకాకుళం జిల్లాలో 2, విశాఖపట్నం జిల్లాలో 4, కృష్ణాలో 1, గుంటూరు జిల్లాలో 1, నెల్లూరు జిల్లాలో 3, తిరుపతి జిల్లాలో 5, చిత్తూరు జిల్లాలో 4, అనంతపురం జిల్లాలో 3, శ్రీసత్యసాయి జిల్లాలో 1, కడప జిల్లాలో 3, కర్నూలు జిల్లాలో 1, ప్రకాశం జిల్లాలో 2 ఉన్నాయి. ఈ ఇండస్ట్రియల్ క్లస్టర్లను పొరుగు రాష్ట్రాల్లోని ప్రధాన రాష్ట్రాలకు కనెక్ట్ చేసేలా ప్లాన్ చేస్తోంది. రాష్ట్రంలో ఈ మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల వెంట దాదాపు 74,583 ఎకరాల ముంపు భూముల్ని గుర్తించి వాటిలో 27వేల ఎకరాలను సేకరించారు. తీర ప్రాంతం వెంట దాదాపు 56,608 ఎకరాలు అందుబాటులో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది.. ఇప్పటికే 36వేల434 ఎకరాలను సేకరించింది. ముంపు ప్రాంతాల్లో 15.. తీర ప్రాంతం వెంట మరో 15 క్లస్టర్లు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ భూముల్ని ఇండస్ట్రియల్ క్లస్టర్ల కోసం ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ప్రధానంగా మారిటైంకు సంబంధించిన పరిశ్రమల్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ క్లస్టర్ల ఏర్పాటుపై ప్రతిపాదనల్ని కేంద్రానికి పంపారు.. కేంద్రం అవసరమైన నిధులు కేటాయించనుండగా.. కొంత వాటాను ఏపీ ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది.

# సింగపూర్ ట్రైనింగ్ మంత్రులు

**విజయవాడ, ఏప్రిల్ 14, పెన్ పవర్:**
ఈ నెల 21 నుంచి 27 వరకు తొమ్మిదిమంది మంత్రులు సింగపూర్‌లో పర్యటిస్తారు. తొమ్మిదిమంది మంత్రుల్లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ, వ్యవయసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, ఆర్ అండ్ బీశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నారు. ఈ తొమ్మిది మంత్రులతో పాటుగా ఆంధ్రప్రదేశ్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి సీనియర్ అధికారులు కూడా సింగపూర్ వెళ్లబోతున్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, సుపరిపాలన, ప్రజలకు మెరుగైన సేవలతో పాటుగా ఇతర అంశాలపై నైపుణ్యాలు పెంచుకునేందుకు శిక్షణ కోసం మంత్రులు సింగపూర్ వెళ్లబోతున్నారు. ఈ పర్యటనలో మంత్రులకు ప్రతిరోజూ ఒక ప్రత్యేక అంశంపై శిక్షణ ఉంటుంది. ఈ తొమ్మిదిమంది మంత్రులు సింగపూర్‌లో శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ ఇచ్చే లీడ్ ట్రైనర్లుగా వ్యవహరిస్తారని తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన స్వర్ణాంధ్ర 2047 విజన్ అమలులో భాగంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. మొదటిరోజు మంత్రులకు నేషనల్ ఫస్ట్ అంశంపై శిక్షణ ఉంటుంది.. ఈ అంశంపై నిపుణులు వివరిస్తారు. రెండో రోజు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ విభాగాలతో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు దగ్గరయ్యే అంశంపై ట్రైనింగ్ ఉంటుంది. మూడో రోజు అత్యవసర పరిస్థితులు ఎదురైతే.. ఆ సంక్షోభాలను ఎలా ఎదుర్కోవాలో శిక్షణ ఉంటుంది. నాలుగో రోజు డిజిటల్ గవర్నమెంట్, సాంకేతిక పరిజ్ఞానం అమలుపై ట్రైనింగ్ ఇస్తారు. ఐదో రోజు ఆర్థిక వృద్ధిపై శిక్షణ ఉంటుంది.. ఆరో రోజు పొలిటికల్ రెస్పాన్సిబులిటీ, ప్రజల్లో నమ్మకం కలిగించే అంశంపై ట్రైనింగ్ ఇస్తారు. ఏడో రోజు యాక్షన్ ప్లాన్‌పై చర్చిస్తారు.. ఆ రోజుతో సింగపూర్‌లో ఏపీ మంత్రుల శిక్షణ ముగుస్తుంది.

# వైసీపీ సెంటిమెంట్ వర్కౌటవుతుందా

**నెల్లూరు, ఏప్రిల్ 14, పెన్ పవర్:**
సీపీ సెంటిమెంట్ తో జనం ముందుకు వెళుతుంది. అది ఎంత వరకూ సక్సెస్ అవుతుందో తెలియదు కానీ... ప్రాంతాల వారీగా వైసీపీ ఆ ప్రాంత ప్రధాన సమస్యలపై ఉద్యమం చేస్తూ తిరిగి పుంజుకోవాలని చూస్తుంది. చూసేందుకు ఇది మంచి స్ట్రాటజీలాగే కనిపిస్తుంది. దీంతో ఆ ప్రాంత నేతలు బయటకు వస్తున్నారు. అలాగే ప్రజల్లోకి కూడా పార్టీ బలంగా వెళ్లగలుగుతుంది. అంటే రెండు రకాలుగా పార్టీకి ప్రయోజనమేనని అంటున్నారు. జగన్ నిర్దేశించిన మేరకు ఇటు రాయలసీమలోనూ, అటు ఉత్తరాంధ్రలోనూ వేర్వేరు సమస్యలపై వైసీపీ పోరాటం చేయడం రానున్న ఎన్నికల్లో తమకు కలసి వస్తుందని వైసీపీ గట్టిగా భావిస్తుంది. ఉత్తరాంధ్రలో ఇటీవల మూలాపేట పోర్టు నిర్మాణాన్ని నిలిపివేయడంపై వైసీపీ నేతలు ఆందోళనకు దిగారు. తాము అధికారంలో ఉండగా 70 శాత పనులు పూర్తి చేస్తే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూలాపేట పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయకుండా నిధులన్నీ అమరావతి నిర్మాణానికే ఖర్చు పెడుతుందని సెంటిమెంట్ ను ఆ ప్రాంత ప్రజల్లో కలిగించేలా నేతలు మాట్లాడారు. నిధులన్నీ ఒక్క



ప్రాంతానికే ఖర్చు చేస్తే మిగిలిన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయని వారు ప్రశ్నిస్తూ గత ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో కోల్పోయిన పట్టును తిరిగి సంపాదించే పనిలో వైసీపీ పడిందని భావించాలి. మరొకవైపు రాయలసీమ ఎత్తిపోతల పథకంపై వైసీపీ ఇటీవల ఆందోళనకు దిగింది. తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడికి సీమ ప్రాంత ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ సీమలోని అన్ని జిల్లాల్లో సభలను, సమావేశాలను, ఆందోళనలను నిర్వహిస్తున్నారు. అన్నీ ఒకే చోట కేంద్రీకరిస్తూ, చివరకు రైతుల ప్రయోజనాలను కూడా పట్టించుకోవడం లేదని వైసీపీ నేతలు జనంలోకి వెళుతున్నారు. ఇలా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వేర్వేరు సమస్యలపై ప్రజల్లోకి వెళుతూ ఆందోళనలు చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని చేస్తున్న ప్రయత్నం ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి.

## రాజకీయ ప్రత్యర్థులు... వ్యాపారంలో మిత్రులు

**విశాఖపట్టణం, ఏప్రిల్ 14, పెన్ పవర్:** ధికార టిడిపిలో మీలాఖత్ రాజకీయాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కొంతమంది టీడీపీ ఎమ్మెల్యేలు వైసీపీకి చెందిన మాజీ నాయకులతో చేతులు కలిపి పలు వ్యాపారాలు చేస్తున్నట్టు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు అందాయి. ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క రకంగా కొంతమంది నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇట్లాంటి రాజకీయాలను సహించేది లేదని కూడా ఆయన తేల్చి చెప్పారు. అంతేకాదు ప్రస్తుతం తెరమీదకు వచ్చిన అనేక అంశాలను ఆయన ప్రస్తావిస్తూ భవిష్యత్తులో ఇట్లాంటి రాజకీయాలు చేసే వారిని పక్కన పెడతానని కూడా హెచ్చరించారు. ఈ పరిణామం టిడిపిలో తీవ్ర చర్చనీయాంసంగా మారింది. అలాగని చంద్రబాబు చెప్తున్నట్టుగా ఇప్పటికి ఇప్పుడు వైసీపీ నాయకులను వదిలేసే పరిస్థితి కనిపించడం లేదు. ఉదాహరణకు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో వైసిపి మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మద్యం వ్యాపారం చేస్తున్న ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి తెలియకుండా చక్రం తిప్పుతున్నారని వార్తలు వచ్చాయి. ఇక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రైస్ మిల్లింగ్ వ్యాపారంలో కూడా వైసీపీకి చెందిన మాజీ మంత్రులు నేతలతో నాయకులు మిలాఖత్ అయ్యారని ప్రభుత్వానికి సమాచారం చేరిందిఅలాగే ఉమ్మడి అనంతపురం జిల్లాలో కూడా వైసీపీ మాజీ మంత్రితో కలిసి కొందరు టిడిపి ఎమ్మెల్యేలు వ్యాపారం చేస్తున్నారని సమాచారం. ఇక ఉత్తరాంధ్రలోనూ ఇటువంటి రాజకీయాలకు కొదవ లేకుండా పోయింది. మొత్తంగా చూస్తే రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబు చెబుతున్న దానికి భిన్నంగా కొందరు నాయకులు అడుగులు వేస్తున్నారు. అయితే ఇలాంటి సందర్భంలో వివాదాలు వచ్చినప్పుడు మాత్రమే నాయకుల పేర్లు బయటకు వస్తున్నాయి. మిగిలిన చోట్ల సర్దుకుపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల విశాఖపట్నంలో ఓ కీలక కంపెనీకి భూములు సేకరించే అంశం వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వైసిపి నేత సహాయం తీసుకుని రైతులను ఒప్పించిన వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూసింది. అయితే ఇది మంచి పరిణామం కాబట్టి ప్రభుత్వం కూడా పెద్దగా పట్టించుకోలేదు. అయితే తర్వాత కాలంలో ఏ మాజీ మంత్రితో చేతులు కలిపి భూములు ఇప్పించారో అదే మాజీ మంత్రితో కలిసి ఇసుక వ్యాపారంలో సదరు టిడిపి నాయకులు పనిచేస్తున్నారని తెలిసి పార్టీ అధిష్టానం విస్మయానికి గురైంది. దీంతో అటు ఎవరిని ఏమీ అనలేక ఇటు సమర్థించుకోలేక క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులపై పార్టీ అంతర్మథనం చెందుతోంది. ఇది ఎన్నాళ్లు కొనసాగుతుందనేది చూడాలి.

## కాశీ యాత్రలో గాయపడ్డ బి. యాలేరు గ్రామస్తులు

**అనంతపురం పెన్ పవర్:** కాశీ యాత్రలో గాయపడ్డ బి. యాలేరు గ్రామస్తులు
అనంతపురం కాశీ యాత్రకు వెళ్లిన ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన పలువురు ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే పరిటాల సునీత స్పందించి.. వారికి మెరుగైన వైద్యం అందించి స్వస్థలానికి చేర్చే విధంగా చర్యలు చేపట్టారు. ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన 48మంది గ్రామస్తులు బస్సులో కాశీయాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో భాగంగా కాశీ గోపిగంజ్ టోల్గేట్ కి 59 కిలోమీటర్ల దూరంలో ఒక రోడ్డు ప్రక్కన వంట చేసుకునేందుకు బస్సును ఆపారు. రోడ్డుకు చాలా దూరంలో వంట చేసుకుంటుండగా.. ఒక టిప్పర్ వాహనం వేగంగా వచ్చి బస్సును ఢీకొంది. బస్సు సమీపంలో వంట చేస్తున్న వారిపై దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో ఏడు మంది గాయపడ్డారు. వెంటనే వారిని సమీపంలోని గోపీగంజ్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే పరిటాల సునీత స్పందించారు. అక్కడున్న యాత్రికులతో మాట్లాడి ఏం జరిగిందన్నది తెలుసుకున్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ దృష్టికి ఈ ప్రమాద ఘటనను తీసుకెళ్లి..
బాధితులకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు వారిని స్వస్థలాలకు చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి మేరకు కలెక్టర్ కూడా వెంటనే స్పందించి తన మిత్రుడైన అక్కడి జిల్లా కలెక్టర్ తో మాట్లాడారు. బాధితులంతా క్షేమంగా ఉన్నారని కేవలం 7 మందికి మాత్రమే గాయాలైనట్లు ఎమ్మెల్యే సునీత తెలిపారు. వారిని స్వస్థలానికి తీసుకొచ్చే విధంగా అన్ని చర్యలు
తీసుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు. గ్రామస్తులు కానీ వారి బంధువులు కానీ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. కాశీ ప్రయాణానికి వెళ్లిన వారంతా సురక్షితంగా ఉన్నట్లు సునీత తెలిపారు.

## మృత్యువు అంచున ఉన్న వ్యక్తికి పునర్జన్మనిచ్చిన 'ఖాకీ' హీరోలు

**బాన్సువాడ, ఏప్రిల్ 13: పెన్ పవర్:** బాన్సువాడ పట్టణంలో సోమవారం నాడు ఒక ఉత్కంఠభరితమైన సంఘటన చోటుచేసుకుంది. ఆస్తి పంపకాల విషయంలో తనకు అన్యాయం జరిగిందని మనస్తాపం చెందిన గూడెం గల్లికి చెందిన రంగరి వెంకటి (55), ఆత్మహత్యే శరణ్యమని భావించి ఉరి వేసుకునే ముందు డయల్ 100కు సమాచారం అందించారు. క్షణాల్లో స్పందించిన పోలీసులు మృత్యువుతో పోరాడుతున్న ఒక నిండు ప్రాణాన్ని కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. సమాచారం అందిన వెంటనే బ్లూ కోల్ట్స్ సిబ్బంది రంగంలోకి దిగారు. స్థానికుల సహాయంతో ఖచ్చితమైన చిరునామాను సేకరించిన పోలీసులు, లోపల గడియ పెట్టుకున్న తలుపులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా పగలగొట్టారు. అప్పటికే వెంకటి ఉరి వేసుకొని కొన ఊపిరితో వేలాడుతుండటం గమనించి, తక్షణమే అతడిని కిందికి దించి ప్రాథమిక చికిత్స
అందిస్తూ హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్య సాయం అందడంతో బాధితుడు ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు. విధి నిర్వహణలో అత్యంత సాహసాన్ని, సమయస్ఫూర్తిని ప్రదర్శించి ప్రాణాలను కాపాడిన పోలీసు కానిస్టేబుల్ డి. నవీన్ మరియు హోంగార్డ్ రాములులను జిల్లా ఎస్పీ యం రాజేష్ చంద్ర ప్రత్యేకంగా అభినందించారు.

## నెక్లెస్ రోడ్లో గ్రూప్-1 ఆఫీసర్స్ సెక్లాథాన్ కార్యక్రమం

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రూప్–1 ట్రైనింగ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో సెక్లాథాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, మర్రి చెన్నరెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ శాంతికుమారి, జీహెచ్ఎంసి కమీషనర్ కర్ణన్, కోర్సు డైరెక్టర్ అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి గ్రూప్ ఆఫీసర్స్ సెక్లాథాన్ ను జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైజింగ్ తెలంగాణ నినాదం వ్యాప్తి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఆలోచనతో గ్రూప్–1 ఆఫీసర్స్ సైక్లాథాన్ నిర్వహించారు. ఈ సైక్లాథాన్ లో 200 మంది గ్రూప్–1 ట్రైనింగ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## కాలువలోకి దూసుకుపోయిన కారు ప్రయాణికులు సురక్షితం

**తిరుపతి పెన్ పవర్:** ఆగి ఉన్న ఆటోను ఢీకొనికారు మురికి కాలువలోకి చొచ్చుకెళ్ళింది. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెన్నై హాస్పిటల్ ఎదురుగా ఘటన జరిగింది. ఒక ఓ హిజ్రా ను పెళ్లి చేసుకొని జీవిస్తున్న భార్యాభర్తలు మద్యం మత్తులో డ్రైవ్ చేయడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదం నుండి బయటపడ్డ ఇరువురు సురక్షితంగా వున్నారు.

## బాబాసాహేబ్ ఐడియాలసీ నిరంతరం మనమద్యే వుంటుంది

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రాజ్యంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా లిబర్టీ సర్కిల్ లోని ఆయన విగ్రహానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం అర్ధరాత్రినివాళులర్పించారు. ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని బాబాసాహెబ్ బర్త్ డే కేక్ కట్ చేసారు. కవిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిదంటే అది బాబాసాహెబ్ అంబేద్కర్ బిక్షే. ఆర్టికల్ 3 అనే శక్తి ఇవ్వటం కారణంగే తెలంగాణ ఏర్పాటుకు పునాది పడింది. అంబేద్కర్ అంటే సాధారణ వ్యక్తి కాదు. ఆయన ఒక ఐడియాలజీ. ఈ భూమి మీద ఎవరైనా యాంటీ అంబ్టెడ్కర్ ఉన్నారంటే అది రేవంత్ రెడ్డి మాత్రమే. బాబా సాహెబ్ 135 వ జయంతి సందర్భంగానైనా ఆయనకు బుద్ది వచ్చి పేదలకు మంచి చేయాలి. ఇప్పటికీ కూడా ప్రతి చోట దళితులు, మహిళలపై ఆకృత్యాలు ఇంకా పెరుగుతున్నాయి. రాష్ట్రంలో ఏ ప్రాజెక్ట్ కట్టినా సరే దళితులే భూములు కోల్పోతున్నారు. దళితులకు ఇచ్చిన అసైన్డ్‌భూములను ప్రభుత్వాలు లాక్కుంటున్నాయి. ఈ పరిస్థితిని సవరించుకుంటూ పేదల భూములను కాపాడుకుంటూ ముందుకు వెళ్లాల్సిన సందర్భం ఇది. మనం వెలుగుమట్లలో చూశాం. పరిగిలో కూడాఅసైన్డ్ భూములనే పెద్ద ఎత్తున తీసుకుంటున్నారు. అక్కడ 12 వందల ఎకరాలు సేకరిస్తే అందులో వెయ్యి ఎకరాలు అసైన్డ్ భూములే. బాబా సాహెబ్ అంటేనే ధైర్యం. ఆయనిచ్చిన ధైర్యంతో పేదవాళ్లకున్యాయం చేసేలా ప్రభుత్వంపై పోరాటం చేస్తామని అన్నారు. ఈ భూమి మీద ఎవరైనా యాంటీ అంబేద్కర్ ఉన్నారంటే అది రేవంత్ రెడ్డి మాత్రమే. బాబా సాహెబ్ 135 వ జయంతి సందర్భంగానైనా ఈప్రభుత్వానికి బుద్ధి రావాలి. వాళ్లు పేదల పక్షాన నిలబడాలి. అంబేద్కర్ గారంటే ఒక సాధారణ మనిషి కాదు. ఆయన ఒక ఐడియాలజీ, ఒక థాట్. ఆయన ఐడియాలజీ నిరంతరం మన మధ్యనే ఉంటుందనిఅన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## నైజీరియాలో విషాదం 100 మందికి పైగా మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** నైజీరియాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఈశాన్య ప్రాంతంలోని యోబే రాష్ట్రంలో ఉగ్రవాదుల స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని సైన్యం జరిపిన వైమానిక దాడి మిస్ఫైర్ అయి వారపు సంతపై ఆ బాంబులు పడటంతో 100 మందికి పైగా గ్రామస్థులు ప్రాణాలు కోల్పోయారు. జిలి గ్రామంలో సంత జరుగుతున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకారం, ఈ దాడిలో కనీసం 100 మందికి పైగా మరణించగా, రాయిటర్స్ నివేదికల ప్రకారం సంఖ్య 200 దాటింది.. మృతుల్లో మహిళలు, పిల్లలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. నైజీరియా వైమానిక దళం తమ లక్ష్యం ఉగ్రవాదుల స్థావరం, లాజిస్టిక్స్ కేంద్రాలే నని, "ఖచ్చితమైన దాడి" జరిపినట్లు పేర్కొంది. అయితే, ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశ మాజీ ఉపాధ్యక్షుడు అటికు అబుబకర్ ఈ దాడిని ఖండిస్తూ, ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈశాన్య నైజీరియాలో బోకో హరామ్, ఐఎస్ డబ్ల్యూఏపీ వంటి ఉగ్రవాద చర్యలు గ్రూపుల పై సైన్యం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 2017 నుంచి సైన్యం చేసిన దాడుల్లో జరిగిన పొరపాట్ల కారణంగా వందలాది పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు అసోసియేటెడ్ ప్రెస్ అంచనా వేసింది. ఈ తాజా ఘటనపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది.

## హంగేరీలో ముగిసిన ఓర్బన్ శకం



**హైదరాబాద్ పెన్ పవర్:** హంగేరీ రాజకీయాల్లో దశాబ్ద కాలానికి పైగా సాగిన విక్టర్ ఓర్బన్ శకానికి తెరపడింది. యువ నాయకుడు పీటర్ మాగ్యార్ ప్రభంజనంతో హంగేరీలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. తాజాగా జరిగిన హంగేరీ సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వెలువడ్డాయి. గత 16 ఏళ్లుగా తిరుగులేని నాయకుడిగా ఉన్న విక్టర్ ఓర్బన్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నారు. 'టిస్టా' పార్టీకి చెందిన యువ సంచలనం పీటర్ మాగ్యార్ ఈ ఎన్నికల్లో విజయ కేతనంతో హంగేరీ రాజకీయాలను మలుపు తిప్పారు. హంగేరీలోని 199 స్థానాలు శాసనసభలో పీటర్ మాగ్యార్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. ఓట్ల లెక్కింపు తుది దశకు వచ్చేసరికి టిస్టా పార్టీ మూడింట రెండు వంతుల మెజారిటీతో ఏకంగా 138 స్థానాలను కైవసం చేసుకునే దిశగా దూసుకుపోతోంది. బుడాపెస్ట్లోని డాన్యూబ్ నది ఒడ్డున చేరిన వేలాది మంది మద్దతుదారుల మధ్య మాగ్యార్ తన విజయాన్ని ప్రకటించారు. ఓర్బన్ ఓటమితో యూరోపియన్ యూనియన్ లో హంగేరీ వ్యవహరిస్తున్న వైఖరికి తెరపడనుంది. గతంలో ఉక్రెయిన్కు అందాల్సిన 90 బిలియన్ యూరోల (వి105 బిలియన్) రుణాన్ని ఓర్బన్ అడ్డుకున్నారు. ఇప్పుడు పీటర్ మాగ్యార్ అధికారంలోకి రావడంతో ఈ నిధుల విడుదలకు మార్గం సుగమం అయ్యే అవకాశం ఉందని సమాచారం. హంగేరీ తిరిగి యూరోపియన్ యూనియన్ లో చేరడం వల్ల రష్యా-ఉక్రెయిన్ యుద్ధ పరిణామాల్లో కూడా మార్పులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. తన ఓటమిని అంగీకరిస్తూ ఓర్బన్ భావోద్వేగ ప్రకటన చేశారు.

## తొలిసారి ఆస్ట్రేలియా 'డిఫెన్స్ చీఫ్'గా మహిళ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియన్ డిఫెన్స్ ఫోర్స్ చరిత్రలో తొలిసారిగా ఒక మహిళను ఆర్మీ చీఫ్గా నియమించారు. ప్రస్తుతం జాయింట్ క్యాపబిలిటీస్ విభాగాధిపతిగా ఉన్న లెఫ్టినెంట్ జనరల్ సూసన్ కోయిల్ జూలైలో ఆర్మీ చీఫ్గా బాధ్యతలు స్వీకరిస్తారని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. లెఫ్టినెంట్ జనరల్ సైమన్ స్టీవార్ట్ స్థానంలో సూసన్ నియమితులవుతారు. దేశ సైనిక చరిత్రలో ఇంతటి ఉన్నత పదవికి ఒక మహిళా అధికారిని ఎంపిక చేయడం ఇదే మొదటిసారి. ఈ నిర్ణయం రక్షణ రంగంలో లింగ సమానత్వానికి, దళాల ఆధునీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆస్ట్రేలియన్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. సైన్యంలోని కమాండ్ మరియు కంట్రోల్ విభాగాలలో ఆమెకున్న సుదీర్ఘ అనుభవం, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో ఆమెకున్న నైపుణ్యం కారణంగా సూసన్ కోయిల్ను ఈ పదవికి నియమించారు. సైన్యంలోని అన్ని స్థాయిలలో మహిళలకు అధిక ప్రాతినిధ్యం కల్పించే లక్ష్యంతో ఆస్ట్రేలియన్ డిఫెన్స్ ఫోర్స్ అమలు చేస్తున్న సంస్కరణలలో ఈ నియామకం ఒక భాగం. ఆస్ట్రేలియన్ డిఫెన్స్ ఫోర్స్ లైంగిక వేధింపులు, వివక్షకు సంబంధించిన అనేక ఆరోపణలను ఎదుర్కొంటోంది. ఒక మహిళ దళాధిపతి పదవికి పదోన్నతి పొందుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. సూసన్ నియామకాన్ని ఒక "చారిత్రాత్మక ఘట్టం"గా రక్షణ మంత్రి రిచర్డ్ మాలెస్ అభివర్ణించారు. 1987లో దళంలో చేరిన 55 ఏళ్ల సూసన్ కోయిల్, అనేక ఉన్నత కమాండ్ పదవులను నిర్వహించారు. ఆస్ట్రేలియా సైనిక దళాల (సైన్యం, నావికాదళం మరియు వైమానిక దళం) ఏ విభాగానికైనా నాయకత్వం వహించిన తొలి మహిళ సుసాన్ అవుతారని మాలెస్ అన్నారు. 2030 నాటికి దళంలో మహిళల నిష్పత్తిని 25 శాతానికి పెంచాలని ఆస్ట్రేలియా రక్షణ దళం లక్ష్యంగా పెట్టుకుంది.

## నైజీరియాలో గురి తప్పిన వైమానిక దాడి!

**హైదరాబాద్ పెన్ పవర్:** నైజీరియాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఈశాన్య ప్రాంతంలోని యోబే రాష్ట్రంలో ఉగ్రవాదుల స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని సైన్యం జరిపిన వైమానిక దాడి విఫలమై, వారపు సంతపై బాంబు పడటంతో 100 మందికి పైగా గ్రామస్థులు ప్రాణాలు కోల్పోయారు. శనివారం జిలి గ్రామంలో సంత జరుగుతున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకారం, ఈ దాడిలో 100 మందికి పైగా మరణించగా, రాయిటర్స్ నివేదికల ప్రకారం సంఖ్య 200 దాటినట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి. మృతుల్లో మహిళలు, పిల్లలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. నైజీరియా వైమానిక దళం తమ లక్ష్యం ఉగ్రవాదుల స్థావరం, లాజిస్టిక్స్ కేంద్రాలేనని, "ఖచ్చితమైన దాడి" జరిపినట్లు పేర్కొంది. అయితే, ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశ మాజీ ఉపాధ్యక్షుడు అటికు అబుబకర్ ఈ దాడిని ఖండిస్తూ, ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈశాన్య నైజీరియాలో బోకో హరామ్, ఐఎస్డబ్ల్యూఏపీ వంటి ఉగ్రవాద గ్రూపులపై సైన్యం చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 2017 నుంచి సైన్యం చేసిన దాడుల్లో జరిగిన పొరపాట్ల కారణంగా వందలాది పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు అసోసియేటెడ్ ప్రెస్ అంచనా వేసింది. ఈ తాజా ఘటనపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది.

# హర్మూజ్ గుండా సురక్షిత ప్రయాణానికి ఫ్రాన్స్, బ్రిటన్ కలిసి పని చేస్తాయి



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియా యుద్ధ విరమణపై పాక్ వేదికగా యూఎస్-ఇరాన్ చర్చలు విఫలమైన విషయం తెలిసిందే. ఇరు దేశాల ప్రతినిధులు పలు అంశాలపై ఏకాభిప్రాయం కుదరక చర్చలు విఫలమైయ్యాయి. దీంతో హర్మూజ్ జలసంధి గుండా చమురు నౌకల రాకపోకలపై సందిగ్ధం నెలకొంది. ఈ క్రమంలోనే ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధి గుండా చమురు నౌకల సురక్షత ప్రయాణానికి ఫ్రాన్స్, బ్రిటన్ కలిసి వివాదాన్ని పరిష్కారిస్తాయని, బ్రిటన్తో కలిసి ఇరాన్తో తాము చర్చలు సాగిస్తామని, ఇకపై ఫ్రాన్స్, బ్రిటన్ సుదీర్ఘ వివాదానికి ముగింపు పలికే దిశగా ముందడుకు వేస్తామని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను పరిష్కరించడానికి, దీర్ఘకాలిక ప్రాంతీయ స్థిరత్వాన్ని నిర్ధారించడానికి జరుగుతున్న విస్తృత దౌత్య ప్రయత్నాలలో ఈ చర్య ఒక భాగమని, ఈ మిషన్ "పూర్తిగా రక్షణాత్మకంగా" ఉంటుందని, ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన మర్మూజ్ గుండా జరిగే సముద్ర రవాణాను పరిరక్షించడానికి, ఫ్రాన్స్-యూకే రాబోయే రోజుల్లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తాయని మాక్రాన్ రాసుకొచ్చారు.

## ఏ ఓడరేవూ సురక్షితంగా ఉండదు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ ఓడరేవులకు ముప్పు కలిగిస్తే ప్రాంతీయ పరిణామాలు తీవ్రమవుతాయని టెహ్రాన్లోని ఖటమ్ అల్-అన్బియా కేంద్ర కార్యాలయ ప్రతినిధి హెచ్చరించారు. ఇరాన్ ఓడరేవుల భద్రతకు ముప్పు ఏర్పడిన పక్షంలో పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్లలోని ఏ ఓడరేవూ సురక్షితంగా ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల ప్రయాణాన్ని అడ్డుకుంటానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనకు ప్రతిగా ఇరాన్ ఈ హెచ్చరికలు జారీ చేసింది. కాగా అన్ని పక్షాలు సంయమనం పాటించాలని చైనా హితవు పలికింది. సముద్ర రవాణా స్వేచ్ఛగా, సుస్థిరంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగినప్పుడే అంతర్జాతీయ సమాజం యొక్క ప్రయోజనాలు నెరవేరతాయని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి జైకన్ చెప్పారు. ఇంధన భద్రతను పరిరక్షించి, సరఫరాలు సజావుగా జరిగేలా చూడడంలో అన్ని పక్షాలతో క లిసి పని చేసేందుకు చైనా సిద్ధంగా ఉన్నదని తెలిపారు. ఇరాన్ బేషరతుగా హోర్ముజ్ జలసంధిని తెరవని పక్షంలో దానిని మూసివేస్తామని, చమురు నౌకల ప్రయాణాన్ని అడ్డుకుంటానని ట్రంప్ బెదిరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన అమెరికా నౌకాదళానికి ఆదేశాలు కూడా జారీ చేశారు. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో మధ్యప్రాచ్య ముడి చమురుపై ఆధారపడిన కొన్ని దేశాలు ఆర్థికంగా నష్టపోయాయి. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. బాధిత దేశాలలో అమెరికా కూడా ఉంది. హోర్ముజ్ను తెరవాలని నిన్నటి వరకూ డిమాండ్ చేసిన ట్రంప్ ఇప్పుడు తాజాగా ఆ జలసంధిని మూసేస్తానని ఎందుకు బెదిరించారు?

## ఓటు వేయడం సెంటిమెంట్ హక్కు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఓటర్ల జాబితాలో పేరు వుండడం, మనం పుట్టిన సొంత దేశంలో ఓటు వేయడమనేది కేవలం రాజ్యాంగ హక్కు మాత్రమే కాదని సెంటిమెంట్తో కూడిన హక్కని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. 'తార్కిక వైరుధ్యాల' కారణంగా లక్షలాది ఓటర్లను జాబితా నుండి మినహాయించడాన్ని, అసెంబ్లీ ఎన్నికలు కేవలం పది రోజులు వున్నాయనగా, తమ పేరు తొలగింపుపై విచారణల కోసం వారు ఎదురు చూస్తుండడాన్ని న్యాయస్థానం ఈ సందర్భంగా ప్రస్తావించింది. పశ్చిమ బెంగాల్లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తీవ్రమైన విమర్శలను, వివాదాలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో సుప్రీం పై వ్యాఖ్యలు చేసింది. పేర్లు తొలగించబడిన ఓటర్లు దాఖలు చేసిన 34లక్షల అప్పీళ్లు 19 అప్పిలేట్ ట్రిబ్యునళ్ల ముందు విచారణకు వున్నాయని కోర్టు పేర్కొంది. ఈ ట్రిబ్యునళ్లలో ఒక్కోదాని ఎదుట లక్షకు పైగా అప్పీళ్లు పెండింగ్లో వున్నాయని తెలిపింది. ఈనెల 9న బెంగాల్ ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ ఖరారు చేసి స్తంభింపచేసింది. రాష్ట్రంలో ఈ నెల 23, 29న ఓటింగ్ జరగనుంది. మరింతగా అందరినీ కలుపుకుని పోయేలా ఎస్ఐఆర్ను మార్చేందుకు నెలల తరబడి న్యాయస్థానం జోక్యం చేసుకుంటూ వచ్చింది. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ చేపట్టిన ఈ ప్రక్రియ కలిగించే తీవ్ర ప్రభావాల గురించి కూడా తీవ్రమైన వ్యాఖ్యలే చేసింది. "ఓటర్ల జాబితాలో పేరు వుండి, మీరు పుట్టిన దేశంలో ఓటు వేసే హక్కును కలిగివుండడమనేది కేవలం రాజ్యాంగ హక్కే కాదని, అది సెంటిమెంట్తో కూడిన హక్కు." అని జస్టిస్ జోమాల్యా బాగ్చి ఎన్నికల కమిషన్ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రాతినిధ్య ప్రక్రియలో మీరు భాగస్వాములు కావడం జాతీయతకు, దేశభక్తికి అతిపెద్ద వ్యక్తీకరణగా నిలుస్తుంది.' అని ఆయన వ్యాఖ్యానించారు. దానిపై ఇసి తరపు న్యాయవాది దామా శేషాద్రి నాయుడు స్పందిస్తూ, ఈ విషయంలో పశ్చిమ బెంగాల్ ప్రత్యేకంగా నిలవలేదని, పేర్ల తొలగింపు విషయంలో ఇతర రాష్ట్రాల మాదిరిగానే బెంగాల్లో కూడా తొలగింపులు చోటు చేసుకున్నాయని చెప్పారు.

## బీహార్ కొత్త సిఎంగా సామ్రాట్ చౌదరి



**హైదరాబాద్ పెన్ పవర్:** బిహార్ కొత్త సీఎంగా బీజేపీ నేత సామ్రాట్ చౌదరి ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్.. తదుపరి ముఖ్యమంత్రి ఆయనే అని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. నితీష్కుమార్ ఏప్రిల్ 10న రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. దీంతో ఆయన సిఎం పదవిలో కొనసాగే అవకాశం లేదు. నితీష్ మంగళవారం ఏప్రిల్ 14న ఉదయం 11 గంటలకు పాట్నాలో క్యాబినెట్ మీటింగ్ నిర్వహించబోతున్నారు. ఈ సమావేశం అనంతరం ఆయన తన సీఎం పదవికి రాజీనామా చేస్తారు. అనంతరం ఎన్డీయే శాసనసభ్యుల సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో ఎన్డీయే నూతన శాసనసభ పార్టీ నేతను ఎన్నుకుంటారు. ఆయనే బీహార్ ముఖ్యమంత్రిగా ఎన్నికవుతారు. కాగా, తదుపరి సిఎం సామ్రాట్ చౌదరినే అని అందరూ అనుకుంటున్నారు. ఆయన బీజేపీలో సీనియర్ నేత. ప్రస్తుత బిహార్ ఉపముఖ్యమంత్రి. 2023లో బిహార్ బీజేపీ అధ్యక్షుడయ్యారు. ఆ తర్వాత కొంతకాలానికి డిప్యూటీ సీఎం అయ్యారు. ఓబీసీలోని కొయేరి సామాజికవర్గానికి చెందిన సామ్రాట్ చౌదరినే బీజేపీ అధిష్టానం సీఎంగా ఎంపిక చేసిందని తెలుస్తోంది.

## తూర్పు పసిఫిక్లో రెండు పడవలపై అమెరికా దాడి

**హైదరాబాద్ పెన్ పవర్:** తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్నాయనే ఆరోపణలపై అమెరికా సైన్యం రెండు పడవలను బాంబులతో పేల్చేసింది. దీంతో పడవలో ఉన్న ఐదుగురు మృతి చెందారు. ఒకరు ప్రాణాలతో బయటపడ్డారు అని అమెరికా సైన్యం ఆదివారం వెల్లడించింది. ట్రంప్ ప్రభుత్వం ఒకవైపు అక్రమ మాదక ద్రవ్యాల రవాణా నౌకలపై దాడులు చేస్తూనే.. మరోవైపు ఇరాన్ ఓడరేవులపై నావికా దిగ్బంధనానికి సన్నాహాలు చేస్తోంది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి అమెరికా నార్కో టెర్రరిస్టులపై దృష్టి పెట్టింది. అక్రమ మాదక ద్రవ్యాల్ని రవాణా చేసేవారికి లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది. ఇప్పటివరకు అమెరికా దాడుల్లో 168 మంది మృతి చెందారు. అక్రమ మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టడానికి తూర్పు పసిఫిక్, కరేబియన్ సముద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా సైన్యం ప్రకటించింది. అయితే తాజాగా పేల్చేసిన పడవల్లో మత్తుపదార్థాలు ఉన్నాయనడానికి అమెరికా సైన్యం వద్ద ఎలాంటి ఆధారాలు లేవు.

## ఇజ్రాయిల్ దాడులకు హిజ్బుల్లా ప్రతీకార దాడులు

**హైదరాబాద్ పెన్ పవర్:** కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ లెబనాన్పై ఇజ్రాయిల్ దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. బీరుట్ లోని పలు కీలక ప్రాంతాలపై ఇజ్రాయిల్ సైన్యం వైమానిక దాడులకు తెగబడుతోంది. ఈ దాడుల్లో అనేక మంది మృతి చెందారు. ఈక్రమంలోనే హిజ్బుల్లా ఇజ్రాయిల్కు చెందిన 43 సైనిక స్థావరాలపై దాడులు చేసినట్లు పేర్కొంది. ఇజ్రాయిల్ వైమానిక దాడులకు ప్రతికార దాడులు చేసినట్లు హిజ్బుల్లా పేర్కొంది. ఈ దాడులు సరిహద్దు వెంబడి ఉన్న ఇజ్రాయెల్ సైనిక స్థావరాలలు, అలాగే ఆక్రమిత సిరియన్ గోలన్ హైట్స్, ఉత్తర ఇజ్రాయెల్తో సహా ఆక్రమిత భూభాగాలే లక్ష్యంగా దాడులు చేసినట్లు పేర్కొంది. గోలన్ హైట్స్లోని అల్-అలికా బ్యారక్స్లో ఉన్న కమ్యూనికేషన్ల కేంద్రంపై డ్రోన్ దాడి కూడా ఉంది, ఇది "నేరుగా లక్ష్యాన్ని ఛేదించిందని" వారు పేర్కొన్నారు. లెబనాన్లోని మైస్ అల్-జబల్లో ఒక ఆసుపత్రి సమీపంలో ఉన్న ఇజ్రాయెల్ మెర్కావా ట్యాంక్పై డ్రోన్ దాడి చేసినట్లు ప్రకటించింది.

## ఉత్తర భారతానికే అధిక ప్రయోజనం : సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్

**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణల కోసం కేంద్రం ఏర్పాటు చేయనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాలపై సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ స్పందించారు. ఈ సవరణలతో దక్షిణ భారత దేశం కంటే ఉత్తర భారత దేశానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు 63 నుంచి 65 లోకసభస్థానాలు పెరిగితే, ఉత్తరాది రాష్ట్రాలకు కనిష్టంగా 200కు పైగా సీట్లు పెరుగుతాయని, దీంతో జాతీయ రాజకీయాల్లో ఉత్తరాది రాష్ట్రాల ప్రభావం గణనీయంగా పెరుగుతుందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రభావం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. లోక్సభ సీట్లను 543 నుంచి 816 స్థానాలకు పెంచే లక్ష్యంతో రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టడానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను కేంద్రం ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే.

## మహిళా బిల్లుతో కమల కుతంత్రం

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తోంది. ఈ బిల్లు అమలు ప్రక్రియను వేగవంతం చేసి 2029 లోక్సభ ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావిస్తోంది. ఇందుకోసం ఆ పార్టీ ఒక ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్తోందని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. ప్రస్తుతం భారత పార్లమెంట్.. నారీ శక్తి వందన్ అధినియమ్ (మహిళా రిజర్వేషన్ బిల్లు) సవరణలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో దేశ రాజకీయాల్లో భారీ మార్పులు చోటు చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని వారు అంటున్నారు. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ అంశం కూడా కీలకంగా మారింది. డీలిమిటేషన్ కోసం 2011 జనగణనను ఉపయోగించడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలగకుండా, రాజకీయ లాభాలను పొందాలని ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు భావిస్తోంది. 2023లో పార్లమెంటు 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించిన విషయం విదితమే. కానీ, ఆ తర్వాత ఈ బిల్లు అమలు ప్రక్రియను డీలిమిటేషన్కు అనుసంధానం చేయడం ద్వారా ఇది ఆలస్యమైంది. దీంతో ఇప్పుడు ఈ మహిళా రిజర్వేషన్ అంశాన్ని 2029 ఎన్నికల కోసం ప్రధాన రాజకీయ ఎజెండాగా మార్చాలని బిజెపి చూస్తోందని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. నిజానికి ఈ బిల్లు అమలు 2034 ఎన్నికలకే జరిగే అవకాశం ఉందని భావించినా.. 2029 ఎన్నికల్లో గట్టెక్కడానికి ఈ బిల్లు ముఖ్యమని బిజెపి భావిస్తోంది. 2024లో బిజెపికి సొంతంగా మెజారిటీ రాకపోవడం ఆ పార్టీని ఆందోళనలోకి నెట్టిందని అందుకే ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు.

# మళ్లీ ఎగబాకిన పసిడి ధరలు..

## కిలో వెండిపై రూ.5 వేలు పెరుగుదల



నిన్న కాస్త తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు, ఇవాళ బులియన్ మార్కెట్‌లో మళ్లీ పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో హైదరాబాద్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పెరిగాయి. ఈ మేరకు 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం 10 గ్రాములపై రూ.1,470 పెరిగి రూ.1,53,930కు చేరింది. అదేవిధంగా ఆభరణాల్లో ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,350 ఎగబాకి రూ.1,41,100 వద్ద ట్రేడ్ అవుతోంది. మరోవైపు కేజీ వెండిపై ఒకేసారి రూ.5,000 పెరగడంతో కిలో వెండి ధర రూ.2,65,000కు చేరుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో స్థానిక పన్నులు, రవాణా ఖర్చుల ఆధారంగా ఈ ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు. పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఇరాన్ యుద్ధం తర్వాత పొంచి ఉన్న ఉద్యోగ సంక్షోభం



ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక రంగాన్ని పశ్చిమాసియా యుద్ధం ఎక్కువ ప్రభావితం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచ బ్యాంకు చీఫ్ అజయ్ బంగా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం భవిష్యత్తులోనూ కొనసాగుతుందని ఆయన తెలిపారు. దీర్ఘకాలంలో అంటే వచ్చే పదేళ్లలో కోట్లాది మందిని ఈ యుద్ధం నిరుద్యోగులుగా మార్చగలిగే ప్రమాదం పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. రాబోయే 10 నుంచి 15 ఏళ్లలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సుమారు 120 కోట్ల మంది ప్రజలు పని చేసే వయస్సులోకి ప్రవేశించనున్నారు. ప్రస్తుత ఆర్థిక ధోరణులు కేవలం 40 కోట్ల ఉద్యోగాలను మాత్రమే సృష్టిస్తాయని, దీనివల్ల దాదాపు 80 కోట్ల ఉద్యోగాల కొరత ఏర్పడుతుందని తెలిపారు. ఇరాన్ యుద్ధం, ముడి చమురు ధరల పెరుగుదల వంటి తాత్కాలిక సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం వల్ల, దేశానికి ముఖ్యమైన దీర్ఘకాల ఉద్యోగ సమస్యలు పట్టించుకోకుండా పోతున్నాయని అజయ్ బంగా అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు తక్షణం ఎదుర్కొంటున్న సంక్షోభాలను, ఉద్యోగ కల్పన, స్వచ్ఛమైన నీటి లభ్యత, విద్యుదీకరణ వంటి దీర్ఘకాలిక ప్రాధాన్యతలతో సమతుల్యం చేసుకోవాలని వరల్డ్ బ్యాంక్ చీఫ్ సూచించారు. ఉద్యోగాలను కల్పించడంలో విఫలమైతే అది అక్రమ వలసలు, అస్థిరతకు ఆజ్యం పోస్తుందని ఆయన స్పష్టం చేశారు. 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా 11.7 కోట్ల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి అంచనాలు చెబుతున్నాయి. తక్షణ సమస్యలైన ద్రవ్యోల్బణం, మార్కెట్ల పతనం, నిధుల కొరతతో పాటు ఉద్యోగాల కొరత, మౌలిక సదుపాయాల కల్పనలో లోపాలు, ఇతర ప్రతికూలతల వంటి దీర్ఘకాల సమస్యలను పరిష్కరించడానికి, ప్రభుత్వం, బ్యాంకులు, ప్రైవేట్ ఇన్వెస్టర్లు కలిసి పని చేయడం చాలా అవసరమని అజయ్ బంగా వెల్లడించారు.

# హర్మూజ్ బ్లాకేడ్‌తో భారత్‌పై తీవ్ర ప్రభావం!



హర్మూజ్ జలసంధిని అమెరికా సైన్యం దిగ్బంధించడంతో ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన నెలకొంది. సౌదీ అరేబియా సహా పలు దేశాలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రిక్వెస్ట్‌లు చేస్తున్నాయి. చైనా సహా ఇంకొన్ని దేశాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నాయి. అదే సమయంలో.. ఈ బ్లాకేడ్ ప్రభావంతో ప్రపంచ ఇంధన మార్కెట్లు కుదేలవుతున్నాయి. ఈ పరిణామం భారత్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపే చాన్స్ కనిపిస్తోంది. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధర ప్రస్తుతం 99 డాలర్ల వద్ద ఉంది. హర్మూజ్ బ్లాకేడ్ కొనసాగితే అది 150 డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ గల్ఫ్ దేశాలపై అధికంగా ఆధారపడుతుంది. చమురు ధరలు పెరగడం వల్ల దిగుమతి బిల్లులు పెరగడం, ద్రవ్యోల్బణం పెరగడం, వాణిజ్య లోటు పెరిగే అవకాశం లేకపోలేదు. పైగా జలసంధి ద్వారా రోజుకు 12 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు సరఫరా జరుగుతుంది. ఈ మార్గం మూసుకుపోతే భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తీవ్ర తరం కావొచ్చు. అలాగే పెరిగిన ఇంధన ధరలు నేరుగా రవాణా, విద్యుత్, ఆహార ధరలపై
ప్రభావం చూపెట్టొచ్చు. హర్మూజ్ బ్లాకేడ్‌పై భారత్ ఇంకా స్పందించాల్సి ఉంది. భారత నౌకలకు హర్మూజ్ జలసంధి మార్గాన్ని ఇరాన్ మూసేసిందని ఒక ప్రచారం నడుస్తోంది. అయితే అది ఉత్తదేనని ఇరాన్ అంటోంది. న్యూఢిల్లీలో ఇరాన్ రాయబారి మొహమ్మద్ ఫతాలి ఎన్‌డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..

"భారతదేశం మా స్నేహపూర్వక దేశం. హర్మూజ్ మార్గం భారత నౌకలకు తెరిచే ఉంటుంది. అమెరికా ఈ బ్లాకేడ్‌తో తప్పు లెక్కలు వేసింది. ఈ చర్య అంతర్జాతీయ చట్టాలను ధ్వంసం చేస్తుందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తుంది" అని హెచ్చరించారు. మొత్తంగా, హోర్ముజ్ బ్లాకేడ్ భారత్‌కు ఇంధన భద్రతా సంక్షోభం తెచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. ఇరాన్ ఇచ్చిన హామీ కొంత ఉపశమనం కలిగిస్తోంది. కానీ ధరల పెరుగుదల, సరఫరా అంతరాయం వంటి సమస్యలు భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద సవాలుగా మారే అవకాశం లేకపోలేదు.

# ఎల్ఐసీ బోనస్ షేర్ల జారీ




1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేసేందుకు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) బోర్డు ఆమోదం తెలిపింది. 2025 డిసెంబరు 31 నాటికి ఎల్ఐసీ వద్ద ఉన్న రూ.6,325 కోట్ల నిల్వలు, మిగులు నిధులతో ఈ బోనస్ ఇష్యూను పూర్తి చేయనున్నట్లు ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఎల్ఐసీ తెలిపింది. రికార్డు తేదీకి (ఇంకా నిర్ణయించలేదు) రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరు కలిగిన వాటాదార్లకు అదనంగా రూ.10 ముఖవిలువ కలిగిన మరో ఈక్విటీ షేరును బోనస్‌గా జారీ చేస్తారు. ప్రస్తుతం ఎల్ఐసీలో ప్రభుత్వానికి 96.5 శాతం వాటా ఉంది. 2022 మేలో ఐపీఓ ద్వారా 3.5 శాతం వాటాను విక్రయించి దాదాపు రూ.21,000 కోట్లను ప్రభుత్వం సమీకరించింది. ఈ బోనస్ షేర్ల ఇష్యూ వల్ల భవిష్యత్తులో ఎల్ఐసీలో ప్రభుత్వం మరింత వాటాను విక్రయించడానికి లేదా ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)కు రావడానికి మార్గం సుగమం అవుతుంది. ఎల్ఐసీ ఓఎఫ్ఎస్‌కు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

## వచ్చే ఏప్రిల్ నుంచే కేఫ్ 3 నిబంధనలు



కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎఫిషియెన్సీ 3(కేఫ్ 3) ప్రమాణాల అమలు గడువును ప్రభుత్వం పొడిగించే అవకాశం లేదని భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి హనీఫ్ ఖురేషి తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి వాహన తయారీదారులు కఠిన ఇంధన సామర్థ్య నిబంధనలను పాటించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కేఫ్ 3 నిబంధనలపై ప్రభుత్వం ఆటో పరిశ్రమ భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది, వారికి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ, అభిప్రాయాలను క్రమం తప్పకుండా కోరుతున్నామన్నారు. అమలు గడువును 2027, ఏప్రిల్ 1 తర్వాత పొడిగించాల్సిన అవసరం రాకపోవచ్చని ఆయన అన్నారు. కాగా, 'కేఫ్-2027'గా పిలిచే ఈ నిబంధనల ప్రకారం, ప్రతి కారు అన్ని మోడళ్ల సగటు ఫ్యూయెల్ ఎఫిషియెన్సీ, కార్బన్ డయాక్సైడ్ ఎమిషన్ నిర్దిష్ట స్థాయి కంటే తక్కువగా ఉండాలి. మరింత సులభంగా చెప్పాలంటే.. వాహనాలు తక్కువ ఇంధనం, తక్కువ కాలుష్యం వాడాలి. మెరుగైన మైలేజీ ఇవ్వాలి.

# ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ దరఖాస్తును వెనక్కి పంపిన ఆర్‌బీఐ




ప్రముఖ ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎఫ్‌బీ) యూనివర్సల్ బ్యాంకుగా మారేందుకు ఇచ్చిన దరఖాస్తును భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వెనక్కి పంపింది. అయితే, ఇది దరఖాస్తును రద్దు చేయడం కాదు, అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందించే పూర్తి స్థాయి బ్యాంకుగా మారేందుకు అవసరమైన స్థాయిలో సిద్ధంగా లేనందున దరఖాస్తును తిరిగివ్వడం. బ్యాంకు తన లోన్ బుక్‌ను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ పేర్కొంది. లోన్ పోర్ట్‌ఫోలియోను అన్ని విభాగాలకు విస్తరించిన తర్వాత దరఖాస్తును పరిగణలోకి తీసుకుంటామని సూచించింది. ప్రస్తుతం ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ ఇచ్చే రుణాలు ఇంకా పూర్తిగా అన్ని విభాగాల్లో లేవు. ఇప్పటికీ ఎక్కువ లోన్స్ ఒకే రకంగా ఉన్నాయి. ముఖ్యంగా అన్‌సెక్యూర్డ్ లోన్స్ వాటా అధికంగా ఉంది. యూనివర్సల్ బ్యాంక్ కావాలంటే, గృహ, వ్యాపార రుణాలు వంటి సెక్యూర్డ్ లోన్లు ఇంకా మెరుగుపడాలి. ప్రస్తుతం బ్యాంకు సెక్యూర్డ్ లోన్లు 43 శాతం నుంచి 49 శాతానికి పెరిగాయి. అన్‌సెక్యూర్డ్ లోన్లు క్రమంగా తగ్గుతున్నాయి. కానీ, సెక్యూర్డ్ లోన్స్ విభాగంలోని హోమ్, గోల్డ్, ప్రాపర్టీ లోన్లు పెంచాల్సి ఉంది. ఈ కారణంగానే ఆర్‌బీఐ మరింత మెరుగుపడిన తర్వాత యూనివర్సల్ బ్యాంకు హోదా కోసం దరఖాస్తు చేయాలని వెల్లడించింది.

# 10 నెలల గరిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం



దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా పెరుగుతోంది. మార్చి నెలలో 10 నెలల గరిష్ఠాన్ని తాకింది. విడుదల చేసిన గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (మోస్పి) గణాంకాల ప్రకారం, వినియోగదారుల ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం మార్చిలో 3.40 శాతానికి పెరిగింది. ఇది ఫిబ్రవరిలో నమోదైన 3.21 శాతం కంటే అధికం. ఆహార పదార్థాల ధరలు పెరగడం వల్లనే రిటైల్ ద్రవ్యోల్బణం పుంజుకుంది. ముఖ్యంగా టమోటాలు, క్యాలీఫ్లవర్, ఆభరణాల ధరలు ఎక్కువ ప్రభావం చేశాయి. వరుస నెలల్లో ద్రవ్యోల్బణం పెరుగుతున్నప్పటికీ ఆర్‌బీఐ 2-6 శాతం పరిధిలోనే ఉంది. సమీక్షించిన నెలలో ఆహార ద్రవ్యోల్బణం 3.87 శాతానికి చేరుకుంది. అంతకుముందు ఫిబ్రవరిలో ఇది 3.47 శాతంగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 3.63 శాతం, పట్టణ ప్రాంతాల్లో 3.11 శాతంగా ద్రవ్యోల్బణం నమోదైంది. తెలంగాణలో అత్యధికంగా 5.94 శాతం ద్రవ్యోల్బణం నమోదు కాగా, ఆ తర్వాతి స్థానాల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ఉన్నాయి.

## ఇవి తింటే గుండె ఆరోగ్యం పదిలం



ఎండలు మండే మధ్యాహ్నంలో చల్లని పుచ్చకాయ ముక్కను ఆస్వాదిస్తున్నప్పుడు అనుకోకుండా ఒక నల్ల గింజ మింగేయడం చాలామందికి సాధారణమే. పుచ్చకాయ గింజలను పూర్తిగా వేరుచేయడం కష్టమైన పని కావడంతో ఇది తరచూ జరుగుతూనే ఉంటుంది. అయితే గింజలు మింగితే కడుపులో చెట్టు మొలుస్తుందనే చిన్ననాటి అపోహలకు ఇప్పుడు ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది. నిజానికి మన జీర్ణవ్యవస్థ గింజలు మొలకెత్తే స్థలం కాదు. పైగా మనం విసిరేస్తున్న ఈ గింజలు అసలు పోషకాహార నిధులని నిపుణులు చెబుతున్నారు. పుచ్చకాయ గింజలు పూర్తిగా సురక్షితమే. వాటిని అలాగే మింగితే అవి ఫైబర్‌లా పనిచేసి జీర్ణవ్యవస్థలో పెద్దగా మార్పు లేకుండా బయటకు వెళ్లిపోతాయి. కానీ వీటిని సరైన విధంగా తీసుకుంటే శరీరానికి అవసరమైన అద్భుతమైన పోషక విలువలు అందుతాయి. చిన్నవిగా కనిపించినా పుచ్చకాయ గింజల్లో ప్రోటీన్ సుమారు 30 శాతం వరకు ఉంటుంది. ఇందులో ఉండే అర్జినిన్ అనే అమినో ఆమ్లం గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. వీటిలో ఉండే మోనో, పాలీ అన్‌సాచురేటెడ్ ఫ్యాట్స్ రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. మెగ్నీషియం, జింక్, ఐరన్ వంటి ఖనిజాలు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ముఖ్యంగా రక్తహీనత సమస్య ఉన్నవారికి ఇవి సహజ పరిష్కారంగా ఉపయోగపడతాయి. వేసవిలో శరీరానికి హైడ్రేషన్ అవసరం ఎక్కువగా ఉంటుంది, ఈ గింజల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని రక్షించి సహజమైన మెరుపును పెంచుతాయి. వేడి కాలంలో గుండెపై పడే ఒత్తిడిని తగ్గించడంలో ఇందులోని మెగ్నీషియం కీలక పాత్ర పోషిస్తుంది. వీటిలో ఉండే బి విటమిన్లు మెటబాలిజాన్ని మెరుగుపరిచి ఆహారాన్ని శక్తిగా మార్చడంలో తోడ్పడతాయి. మధ్యాహ్నం వేళల్లో వచ్చే అలసటను తగ్గించడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి. సాధారణంగా భారతీయ వంటకాలలో ఇతర గింజలను మిఠాయిల్లో, కర్రీల్లో వాడే సంప్రదాయం ఉన్నప్పటికీ, పుచ్చకాయ గింజలు మాత్రం ఎక్కువగా వృథా అవుతున్నాయి. మొక్కల ఆధారిత ప్రోటీన్ పెంచుకోవాలనుకునే వారికి ఇవి ఉత్తమమైన ఎంపిక. పుచ్చకాయ గింజలు మేలు చేసేవే అయినప్పటికీ వాటిని నేరుగా మింగడం వల్ల పూర్తి ప్రయోజనం అందదు. గింజల పై పొల గట్టిగా ఉండటం వల్ల వాటిని మొలకెత్తించడం ఉత్తమ పద్ధతి. రాత్రంతా నానబెట్టి, రెండు రోజులు మొలకలు వచ్చాక ఎండబెట్టి లేదా వేయించుకుని తినవచ్చు. సులభంగా తినాలంటే గింజలను శుభ్రం చేసి కొద్దిగా నెయ్యి లేదా నూనెలో వేసి ఉప్పు, కారం, ఆమ్ చూర్ కలిపి వేయించుకోవచ్చు. ఇవి సన్‌ఫ్లవర్ గింజల మాదిరిగా రుచిగా ఉంటాయి. వీటిని ఉప్మా, సలాడ్స్ లేదా స్మూతీలలో కూడా కలుపుకోవచ్చు. ఏ పదార్థమైనా మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. పుచ్చకాయ గింజలను ఎక్కువగా తీసుకుంటే అందులోని ఫైబర్ కారణంగా పొట్ట ఉబ్బరం వంటి సమస్యలు రావచ్చు. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారు వేయించిన లేదా మొలకెత్తించిన గింజలనే ఎంచుకోవాలి. ఇవి అధిక క్యాలరీలతో కూడినవి కావడంతో రోజుకు చిన్న మోతాదులో అంటే 25-30 గ్రాములు తీసుకుంటే సరిపోతుంది. ఈ వేసవిలో పుచ్చకాయ గింజలను వృథా చేయకుండా ఆహారంలో భాగం చేసుకుంటే శరీరానికి సహజంగా శక్తి, పోషణ లభిస్తాయి. చిన్న గింజలలో దాగి ఉన్న పెద్ద ప్రయోజనాలను గుర్తించి ఆరోగ్యంగా ఉండండి.

## ఐస్ క్రీం చూస్తే ఆగలేకపోతున్నారా?



పిల్లల నుంచి పెద్దల వరకు ఐస్ క్రీమ్ తింటుంటారు. కానీ నాలుకకు కలిగే ఈ సంతృప్తి శరీరానికి దీర్ఘకాలిక ప్రమాదాలను కలిగిస్తుందని ఆరోగ్య నివేదికలు హెచ్చరిస్తున్నాయి. మండే ఎండలో చల్లని ఐస్ క్రీమ్ తినడం చాలా మందికి సరదా. అందుకే పిల్లల నుంచి పెద్దల వరకు వేడిలో ఐస్ క్రీమ్ తింటుంటారు. కానీ నాలుకకు కలిగే ఈ సంతృప్తి శరీరానికి దీర్ఘకాలిక ప్రమాదాలను కలిగిస్తుందని ఆరోగ్య నివేదికలు హెచ్చరిస్తున్నాయి. వైద్యుల ప్రకారం అధికంగా ఐస్ క్రీమ్ తినే అలవాటు ఊబకాయానికి దారితీయడమే కాకుండా గుండె జబ్బులు, మధుమేహం వంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా కారణమవుతోంది. ఐస్ క్రీమ్ ప్రధానంగా చక్కెర, కొవ్వు, పాల ఉత్పత్తులతో తయారు చేస్తారు. ఒక కప్పు సాదా వెనీలా ఐస్ క్రీమ్‌లోని చక్కెర పరిమాణం ఒక వయోజన వ్యక్తికి రోజువారీ అవసరమయ్యే చక్కెర పరిమాణానికి సమానం. పోషకాహార నిపుణుల ప్రకారం ఐస్ క్రీమ్‌ను క్రమం తప్పకుండా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అసాధారణంగా పెరుగుతాయి, దీనివల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం చాలా రెట్లు పెరుగుతుంది. అంతేకాకుండా ఇందులో అధిక కేలరీలు ఉండటం వల్ల ఇది వేగంగా బరువు పెరగడానికి, ఊబకాయానికి కారణమవుతుంది. ఐస్ క్రీమ్‌లో 'సంతృప్త కొవ్వు' లేదా శాచురేటెడ్ ఫ్యాట్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. ధమనులలో కొవ్వు పేరుకుపోవడం రక్త ప్రసరణకు ఆటంకం కలిగిస్తుంది. దీనివల్ల భవిష్యత్తులో అధిక రక్తపోటు, గుండెపోటు సంభవించవచ్చు. ముఖ్యంగా కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారికి ఐస్ క్రీమ్ సైలెంట్ కిల్లర్ లాంటిది. చాలా మందికి ఐస్ క్రీమ్ తిన్న తర్వాత అకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి వస్తుంది. దీనిని వైద్యపరంగా 'స్ఫెనోపలాటైన్ గాంగ్లియోన్యూరోపతీ' అంటారు. సాధారణంగా దీనిని 'బ్రెయిన్ ఫ్రీజ్' అని కూడా అంటారు. అత్యంత చల్లని పానీయాలు లేదా ఆహార పదార్థాలు అంగిలికి తగిలినప్పుడు రక్తనాళాలు సంకోచించి ఈ నొప్పికి కారణమవుతాయి. అంతేకాకుండా అధిక చక్కెర మెదడు పనితీరు, జ్ఞాపకశక్తిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని కొన్ని అధ్యయనాలు పేర్కొన్నాయి.

## వ్యాయామం వ్యసనంగా మారుతుందా?

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెరగడం శుభపరిణామమే..! అయితే ఆరోగ్యం కోసం చేసే వ్యాయామం క్రమంగా అడిక్షన్‌గా మారుతోందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రమం తప్పకుండా జిమ్‌కు వెళ్లడం మంచిదే కానీ, అది ఒక వ్యసనంగా మారినప్పుడు శారీరక ప్రయోజనాల కంటే మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెరగడం శుభపరిణామమే..! అయితే ఆరోగ్యం కోసం చేసే వ్యాయామం క్రమంగా అడిక్షన్‌గా మారుతోందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రమం తప్పకుండా జిమ్‌కు వెళ్లడం మంచిదే కానీ, అది ఒక వ్యసనంగా మారినప్పుడు శారీరక ప్రయోజనాల కంటే మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఒకరోజు వ్యాయామం చేయకపోతే విపరీతమైన అపరాధ భావం, ఆందోళన చెందుతుంటే మీరు ఎక్సర్‌సైజ్ అడిక్షన్ బారిన పడ్డారని గుర్తించాలి. కేవలం క్యాలరీలను కరిగించడమే లక్ష్యంగా పెట్టుకుని, శరీరం సహకరించకపోయినా గంటల తరబడి శ్రమించడం వల్ల దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా అతిగా వ్యాయామం చేయడం వల్ల హార్మోన్ల అసమతుల్యత, తీవ్రమైన అలసట, కండరాల క్షీణత వంటి సమస్యలు ఎదురవుతాయి. సాధారణంగా వ్యాయామం చేసిన తర్వాత శరీరం ఉత్తేజితం కావాలి. కానీ అతిగా శ్రమించడం వల్ల నిద్రలేమి, చిరాకు, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనిని వైద్య పరిభాషలో ఓవర్ ట్రైనింగ్ సింట్రోమ్ అని పిలుస్తారు. వ్యాయామం అనేది మీ దైనందిన జీవితంలో ఒక భాగం కావాలి. కానీ, అదే మీ జీవితం కాకూడదు. సామాజిక సంబంధాలను, ఉద్యోగ బాధ్యతలను పక్కన పెట్టి కేవలం వర్కవుట్స్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారంటే, మీ ఫిట్‌నెస్ రొటీన్ ఆరోగ్యకరమైన పరిమితులను దాటిందని అర్థం. ఆరోగ్యకరమైన వర్కవుట్ రొటీన్ కోసం సమతుల్యత పాటించడం చాలా ముఖ్యం. వారానికి కనీసం ఒకటి లేదా రెండు రోజులు శరీరానికి పూర్తి విశ్రాంతి ఇవ్వాలి. దీనివల్ల కండరాలు కోలుకోవడానికి సమయం దొరుకుతుంది. వ్యాయామంతో పాటు పోషకాహారం, తగినంత నిద్రపై దృష్టి పెట్టాలి. మీ శరీరం ఇచ్చే సంకేతాలను గమనించండి. విపరీతమైన నొప్పి లేదా అలసట ఉన్నప్పుడు బలవంతంగా వ్యాయామం చేయడం మానుకోవాలి. ఫిట్‌నెస్ అనేది జీవితకాల ప్రయాణం అని గుర్తుంచుకోవాలి. కాబట్టి వ్యాయామాన్ని ఎంజాయ్ చేస్తూ చేయాలే తప్ప, దానిని ఒక శిక్షగా భావించకూడదు. అప్పుడే మీరు శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా దృఢంగా ఉండగలరని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# రెండు కివీలు మలబద్ధకానికి చెక్!

మలబద్ధకం నుంచి విముక్తి పొందాలంటే కివీ పండే మేలని పరిశోధనలు చెబుతున్నాయి. ప్రతిరోజూ ఉదయం రెండు కివీ పండ్లు తీసుకుంటే కడుపు క్లీన్ అవ్వడమే కాదు.. మీ రోగనిరోధక శక్తి కూడా బుల్లెట్ వేగంతో పెరుగుతుంది. నేటి ఉరుకుల పరుగుల జీవితం, మారిన ఆహారపు అలవాట్ల వల్ల మలబద్ధకం, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలు ఇంటింటికీ సాధారణమైపోయాయి. ఈ సమస్యల నుండి ఉపశమనం పొందడానికి చాలామంది రకరకాల మందులు వాడుతుంటారు. అయితే వీటన్నింటికంటే ప్రతిరోజూ రెండు కివీ పండ్లు తినడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయని తాజా వైద్య పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. సుమారు 184 మందిపై నిర్వహించిన ఒక అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పరిశోధకులు వీరిని రెండు బృందాలుగా విభజించి, ఒక బృందానికి ప్రతిరోజూ రెండు కివీ పండ్లు, మరో బృందానికి ఇసబ్గోల్ లేదా సైలియం పొట్టు ఇచ్చారు. నాలుగు వారాల తర్వాత చూస్తే.. కివీ పండ్లు తిన్నవారిలో జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా, కడుపునొప్పి, ఒత్తిడి వంటి సమస్యలు గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు. కివీ పండులో ఉండే యాక్టినిడిన్ అనే ఎంజైమ్, అధిక ఫైబర్ కంటెంట్ ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే కరిగే ప్రీబయోటిక్ ఫైబర్ ప్రేగులలోని మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదపడి, కడుపును ఆరోగ్యంగా ఉంచుతుంది. కేవలం జీర్ణక్రియకే కాదు, కివీ పండు రోగనిరోధక శక్తిని పెంచడంలో



కూడా మేటి. కివీలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది జలుబు, దగ్గు వంటి అంటువ్యాధుల నుండి రక్షణ ఇస్తుంది. రోజూ రెండు గోల్డెన్ కివీ పండ్లు తినే వృద్ధులలో గొంతు నొప్పి, ముక్కు దిబ్బడ వంటి సమస్యలు తక్కువగా ఉంటాయని, ఒకవేళ అనారోగ్యం సోకినా వారు చాలా వేగంగా కోలుకుంటారని అధ్యయనం తేల్చింది. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. బరువు నియంత్రణ: తక్కువ కేలరీలు, ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఎంపిక. కంటి చూపు: కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ల్యూటిన్, జీక్సాంథిన్ వంటి మూలకాలు కివీలో ఉన్నాయి. చర్మ సౌందర్యం: యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా మార్చుతాయి. కివీలో ఎన్ని ప్రయోజనాలు ఉన్నా, కొందరికి ఇది అలెర్జీని కలిగించవచ్చు. నోరు వాపు లేదా దురద వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. మొదట్లో తక్కువ పరిమాణంలో తింటూ మీ శరీరానికి ఇది పడుతుందో లేదో చూసుకోవడం మంచిది.

# ఏబీసీ జ్యూస్ తాగితే ఏమవుతుంది?




ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్‌ల కలయికతో కూడిన ఆరోగ్యకరమైన శక్తివంతమైన పానీయం.. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా పిల్లలకు కంటి చూపు మెరుగుదల, రోగనిరోధక శక్తి పెంపొందించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ మూడు పదార్థాలు యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. వేసవిలో శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, కూలింగ్ డ్రింక్‌గా అద్భుతంగా పనిచేస్తుంది. ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మంచి ఆహారాన్ని తీసుకోవడం.. ఉత్తమమైన జీవనశైలిని అనుసరించడం చాలా మంచిది.. అయితే, ఎండాకాలంలో బాడీని కూల్ గా ఉంచుకునేందుకు మంచి పానీయాలను, ఆహారాలను తీసుకోవాలి.. దీనివల్ల శరీరానికి పోషకాలు, శక్తి లభించడంతోపాటు.. ఆరోగ్యంగా ఉండవచ్చు.. వేసవి తాపం నుంచి బయటపడొచ్చు.. అలా మేలు చేసే పానీయాల్లో ఏబీసీ జ్యూస్ ఒకటి.. యాపిల్, బీట్‌రూట్, క్యారెట్‌ల కలయికతో తయారైన అత్యంత పోషకమైన పానీయం.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు .. పలు సమస్యల నివారణకు సహాయపడుతుంది.. దీనిలోని పోషకాలు.. చర్మాన్ని కాంతివంతం చేయడంతోపాటు.. రోగనిరోధక శక్తిని పెంచుతాయి.. ఇంకా ఈ జ్యూస్ శరీరాన్ని డిటాక్స్ చేసి.. బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఈ జ్యూస్ ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. నిపుణుల ప్రకారం.. ఏబీసీ డ్రింక్, కంటి చూపును మెరుగుపరిచే, శరీర ఉష్ణోగ్రతను తగ్గించే, రోగనిరోధక శక్తిని పెంచే ఒక అద్భుతమైన ఆరోగ్య పానీయం. యాపిల్, బీట్‌రూట్, క్యారెట్.. ఈ మూడు పదార్థాలు యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. పిల్లలకు బీట్‌రూట్ లేదా క్యారెట్ జ్యూస్‌లు విడిగా ఇవ్వడం కష్టమైనప్పుడు.. ఈ ఏబీసీ డ్రింక్ వారికి ఆకర్షణీయంగా ఉండి, మంచి ఆహారాన్ని అందించడంలో సహాయపడుతుంది. జ్యూస్‌ను గ్లాస్‌లో పోసుకున్న తర్వాత, డయాబెటిస్ సమస్య ఉన్నవారు 1 నుండి 1.5 స్పూన్ల తేనెను కలుపుకోవచ్చు. సాధారణ వ్యక్తులు 3 నుండి 4 స్పూన్ల తేనెను ఉపయోగించుకోవచ్చు. రుచి కోసం అవసరమైతే కొద్దిగా నిమ్మరసం కలుపుకోవచ్చు, లేదా నిమ్మరసం లేకుండానే తీసుకోవచ్చు. ఈ జ్యూస్ రుచికరంగా ఉండటంతో పాటు ఎన్నో పోషకాలను అందిస్తుంది. బీట్‌రూట్, క్యారెట్‌లను సాధారణంగా కూరగాయల జ్యూస్‌లలో తీసుకుంటూ ఉంటారు.. వాటికి ఆపిల్‌ను జోడించడం ద్వారా వేసవిలో చక్కటి కూలింగ్ డ్రింక్‌గా మారుతుంది. ఇది ఏ వయసు వారికైనా సులువుగా తాగగలిగే పానీయం.

# మిల్లెట్స్.. ఆరోగ్యానికి మంచివే..కానీ

జొన్నలు, రాగులు వంటి మిల్లెట్లు శరీరానికి అవసరమైన శక్తిని అందించడమే కాకుండా వేసవిలో ఎదురయ్యే అలసటను దూరం చేస్తాయి. ఇవి తక్కువ నీటితో పండే పంటలు కావడంతో పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా, మన శరీరానికి అవసరమైన మాక్రో, మైక్రో పోషకాలను సమృద్ధిగా అందిస్తాయి. ఎండాకాలం తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో శరీర అంతర్గత ఉష్ణోగ్రతను నియంత్రించుకోవడం అత్యంత అవసరంగా మారింది. బయట నమోదవుతున్న రికార్డు స్థాయి వేడిని తట్టుకోవాలంటే కేవలం నీళ్లు తాగడం మాత్రమే సరిపోదు, మనం తీసుకునే ఆహారంలో కూడా కీలక మార్పులు చేయాలి. ముఖ్యంగా భారతీయ వేసవి కాలాల్లో శరీరంపై పడే ప్రభావాన్ని తగ్గించడానికి ప్రాచీన కాలం నుండి మన పూర్వీకులు అనుసరిస్తున్న చిరుధాన్యాల వినియోగం ఇప్పుడు మళ్లీ ప్రాధాన్యతను సంతరించుకుంది. సాధారణంగా రాగులు గాఢ రంగులో ఉండటం వల్ల ఇవి వేడి చేస్తాయని చాలామంది పొరపడుతుంటారు. కానీ వాస్తవానికి రాగి శరీరానికి అత్యంత చల్లదనాన్ని ఇచ్చే ధాన్యం. ఇందులో కాల్షియం, ఐరన్ సమృద్ధిగా ఉండటం వల్ల వేసవిలో వచ్చే నీరసాన్ని తగ్గిస్తుంది. దీనిని అంబలి లేదా మాల్ట్ రూపంలో తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. అలాగే జొన్నలు కూడా వేసవికి ఎంతో అనుకూలమైనవి. ఇవి శరీర ఉష్ణోగ్రతను పెంచవు. జొన్నల్లో ఉండే పొటాషియం, ఫాస్ఫరస్ చెమట ద్వారా మనం కోల్పోయే



ఎలక్ట్రోలైట్‌లను భర్తీ చేస్తాయి. జొన్న రొట్టెలను పెరుగు లేదా కీరదోస రైతాతో కలిపి తీసుకుంటే శరీరానికి మరింత చల్లదనం కలుగుతుంది.
ఊదలు తక్కువ కేలరీలతో ఉండి సులభంగా జీర్ణమవుతాయి. ఇవి నీటిని నిల్వ చేసే సామర్థ్యం కలిగి ఉండటం వల్ల డీహైడ్రేషన్ నుండి కాపాడతాయి. వేసవిలో తేలికపాటి ఖిచ్డీ లేదా కూరగాయల పులావ్ రూపంలో వీటిని తీసుకోవచ్చు. అలాగే కొర్రలు ఫైబర్ అధికంగా కలిగి ఉండి రోజంతా శక్తిని సమంగా అందిస్తాయి. కోడో మిల్లెట్ కూడా వేసవికి అనువైన ఆహారం, దీనితో పెరుగన్నం తయారు చేసుకుంటే శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. అయితే సజ్జలు శరీరంలో వేడిని పెంచే గుణం కలిగి ఉంటాయి కాబట్టి వీటిని వేసవిలో తగ్గించి, శీతాకాలంలో తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. మిల్లెట్లను వండే ముందు కనీసం 6 నుండి 8 గంటల పాటు నానబెట్టడం తప్పనిసరి. ఇలా చేయడం వల్ల అందులోని ఫైటిక్ యాసిడ్ తగ్గి పోషకాలు శరీరానికి బాగా అందుతాయి. ఫెర్మెంటేషన్
ప్రక్రియ ద్వారా అంబలి వంటి వంటకాలు తయారు చేయడం వల్ల జీర్ణక్రియకు ఉపయోగపడే ప్రోబయోటిక్స్ లభిస్తాయి. మిల్లెట్లలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల వీటిని తీసుకునేటప్పుడు తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. రోజుకు కనీసం 3 లీటర్ల నీరు తీసుకోవడం ద్వారా కడుపు ఉబ్బరం వంటి సమస్యలను నివారించవచ్చు. సరైన పద్ధతిలో చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకుంటే వేసవి వేడిని సులభంగా తట్టుకోవచ్చు.

# ఐపీఎల్ ఆటగాడిపై రెండేళ్ల నిషేధం విధించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు

## ఐపీఎల్ కోసం పీఎస్ఎల్‌ను వీడిన బ్లెస్సింగ్ ముజరబానీ
## జింబాబ్వే పేసర్‌పై రెండేళ్ల పాటు పీసీబీ నిషేధం
## పీఎస్ఎల్‌లో ఆడాల్సి ఉండగా కేకేఆర్ జట్టుకు మారిన వైనం
## ఒప్పంద ఉల్లంఘన కారణంగానే ఈ చర్యలన్న పాక్ బోర్డు
## కేకేఆర్ తరఫున ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ఆడిన ముజరబానీ




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ కోసం, పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)కు చివరి నిమిషంలో దూరమైన జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానీపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కఠిన చర్యలు తీసుకుంది. పీఎస్ఎల్‌లో రెండేళ్ల పాటు ఆడకుండా అతనిపై నిషేధం విధిస్తున్నట్టు అధికారికంగా ప్రకటించింది.వాస్తవానికి, 29 ఏళ్ల ముజరబానీ ఐపీఎల్, పీఎస్ఎల్ వేలంలో అమ్ముడుపోలేదు. అయితే, పీఎస్ఎల్ ఫ్రాంచైజీ ఇస్లామాబాద్ యునైటెడ్ అతడిని రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా తీసుకుంది. కానీ, అదే సమయంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కూడా ముస్తాఫిజుర్ రెహ్మాన్ స్థానంలో అతడిని జట్టులోకి తీసుకుంటున్నట్టు ప్రకటించింది. దీంతో ముజరబానీ పీఎస్ఎల్ కాకుండా ఐపీఎల్‌లో ఆడేందుకే మొగ్గు చూపాడు.ఈ పరిణామంపై క్రమశిక్షణ చర్యలు చేపట్టిన పీసీబీ, ముజరబానీపై రెండేళ్ల నిషేధం విధించింది. ఒప్పందాలను ఉల్లంఘించడం, క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించడం వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించింది. పీఎస్ఎల్ ప్రతిష్ఠను, వృత్తిపరమైన వాతావరణాన్ని కాపాడేందుకే ఈ కఠిన చర్యలు అవసరమని పేర్కొంది. గత ఏడాది కూడా ఇలాగే ప్రవర్తించిన కార్బిన్ బాష్‌పై పీసీబీ ఏడాది పాటు నిషేధం విధించిన విషయం తెలిసిందే.ఇదిలా ఉండగా, ముజరబానీ ఇప్పటికే కేకేఆర్ తరఫున రెండు మ్యాచ్‌లు ఆడాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో నాలుగు వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. ముజరబానీతో పాటు స్పెన్సర్ జాన్సన్, దసున్ షనక కూడా పీఎస్ఎల్ ఒప్పందాలను వదులుకుని ఐపీఎల్‌లో చేరారు. వీరిపై పీసీబీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

# ఇలా చేస్తే సంజును త్వరగా ఔట్ చేయొచ్చు..!
# కేకేఆర్‌కు బ్రహ్మాస్త్రం అందించిన ఇర్ఫాన్ పఠాన్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 19లో భాగంగా మంగళవారం (ఏప్రిల్ 14) చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ తలపడనున్నాయి. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా రాత్రి 7.30 గంటలకు ఈ మ్యాచ్ స్టార్ట్ కానుంది. ఈ మ్యాచ్‌కు ముందు అందరి కళ్లు చెన్నై స్టార్ ప్లేయర్ సంజు శాంసన్?పైనే ఉన్నాయి. ఈ సీజన్‌ను పేలవంగా ఆరంభించిన సంజు ఢిల్లీ క్యాపిటల్స్?పై సెంచరీతో చెలరేగి తన సత్తా ఏంటో మరోసారి చూపించాడు. చెటా? సెంచరీతో ఈ సీజన్‌లో చెన్నై తొలి విజయాన్ని నమోదు చేసింది. సెంచరీతో తిరిగి ఫామ్‌లోకి వచ్చిన సంజు శాంసన్‌ను కట్టడి చేసేందుకు కేకేఆర్ ప్రత్యేక వ్యూహాలు రచిస్తోంది. ఈ క్రమంలో సంజును త్వరగా ఎలా ఔట్ చేయొచ్చో కేకేఆర్‌కు సలహా టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్. కేకేఆర్ స్టార్ స్పిన్నర్ సునీల్ నరైన్ బౌలింగ్‌లో ఆడటానికి సంజు ఇబ్బంది పడతాడని.. నరైన్ బౌలింగ్‌లో ఇప్పటికే అతడు మూడు సార్లు ఔట్ అయ్యాడని గుర్తు చేశారు. నరైన్ బౌలింగ్?లో సంజు దాదాపు 80 బంతులు ఎదుర్కొగా స్ట్రైక్ రేట్ కేవలం 80 మాత్రమే ఉందని అతని బలహీనతను బయటపెట్టాడు.నరైన్ బౌలింగ్‌లో భారీ షాట్లు ఆడేందుకు కూడా శాంసన్ ఎక్కువగా రిస్క్ చేయడని పేర్కొన్నారు. ఇవాల్టి మ్యాచులో కేకేఆర్ నరైన్‌ను ఎంత తొందరగా బౌలింగ్‌కు తీసుకువస్తే శాంసన్‌ను అంత త్వరగా ఔట్ చేయొచ్చని సూచించాడు. అయితే, చెపాక్ పిచ్‌పై బౌన్స్ ఎక్కువగా ఉండటంతో బ్యాటర్లు భారీ స్కోర్లు చేసే అవకాశం ఉందని.. మరీ సంజు ఎలా ఆడతాడో చూడాలన్నారు ఇర్ఫాన్. ఐపీఎల్‌లో మోస్ట్ సక్సెస్ ఫుల్ జట్లుగా పేరున్న చెన్నై, కోల్‌కతా ఈ సీజన్‌ను అతి దారుణంగా ఆరంభించాయి. ఇరు జట్లు ఆడిన తొలి మ్యాడు మ్యాచుల్లో ఓటమి పాలయ్యాయి. రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలోని సీఎస్‌కే నాలుగో మ్యాచ్‌లో ఎట్టకేలకు డీసీపై విజయం సాధించాయి టోర్నీలో బోణీ కొట్టింది. ఆడిన నాలుగు మ్యాచుల్లో మూడు ఓడిపోగా.. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అవడంతో ఈ టోర్నీలో కేకేఆర్ ఇంకా విజయాల ఖాతా తెరవలేదు. దీంతో చెన్నైపై గెలిచైనా బోణీ కొట్టాలని కేకేఆర్ భావిస్తోంది.

# ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్.. SRHలోకి ఎలా వచ్చారో తెలుసా..? అంతా వరుణ్ ఆరోన్ పుణ్యమే..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ IPL సీజన్‌లోనే ఓటమి ఎరుగని జట్టుగా పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో ఉన్న RR జట్టుకు SRH టీం ఓటమి రుచి చూపించింది. రాజస్తాన్ రాయల్స్ ఓడిపోయినా పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలోనే కొనసాగుతుండొచ్చు. కానీ.. ఓడిన తీరు మాత్రం రాజస్తాన్ అభిమానులను పీడ కలలా వెంటాడుతుందని చెప్పక తప్పదు. అందుకు.. కారణం.. ఇద్దరు SRH బౌలర్లు. ఆరంభ మ్యాచ్‌తోనే SRH పేసర్లు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ RR బ్యాటర్లకు చుక్కలు చూపించారు. ఐపీఎల్ మ్యాచ్ ఫస్ట్ ఓవర్లోనే మూడు వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్‌గా ప్రఫుల్ హింగే రికార్డుకెక్కాడు. మొత్తం నాలుగు వికెట్లు తీసి ఔరా అనిపించాడు. సాకిబ్ హుస్సేన్ కూడా 4 వికెట్లు తీసి శభాష్ అనిపించాడు. ఈ ఇద్దరు బౌలర్లు వజ్రాలే కానీ ఈ వజ్రాలను వెలికితీసి సాన పట్టింది మాత్రం ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్. అసలు.. ఈ ఇద్దరి బౌలర్లను SRH వేలంలో చెరో రూ.30 లక్షలకు కొనడానికి కూడా కారణం ఇతనే. గత డిసెంబర్‌లో జరిగిన వేలంలో తన పట్టుదల వల్లే ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం ఈ ఇద్దరు బౌలర్లను రూ. 30 లక్షలకు తీసుకోవడానికి అంగీకరించిందని ఆరోన్ కూడా చెప్పారు. అంతేకాదు.. ప్రఫుల్ హింగే జర్నీలో ఆరోన్ కీలక పాత్ర పోషించాడు. విదర్భకు చెందిన 24 ఏళ్ల హింగే.. 10 రంజీ ట్రోఫీ మ్యాచ్‌లు ఆడి, ఐపీఎల్‌లో అరంగేట్రం చేయడానికి ముందు కేవలం ఒకే ఒక టీ20 మ్యాచ్ ఆడాడు. ఆ సమయంలోనే ప్రఫుల్ హింగే కెరీర్ కోలుకోలేని మలుపు తిరిగింది. హింగే బౌలింగ్ కెరీర్‌కే ముప్పు తెచ్చే గాయం అయింది. అతని క్రికెట్ కెరీర్ ముగిసిపోయిందని కుటుంబం కూడా ఫిక్స్ అయిపోయింది. ఆ సమయంలోనే ప్రఫుల్ హింగేకు వరుణ్ ఆరోన్ అండగా నిలిచాడు. గాయం నుంచి కోలుకునే దిశగా హింగేలో ఆత్మ స్థైర్యాన్ని నింపాడు. అసలైన కెరీర్ ఇప్పటి నుంచే మొదలైందని.. ప్రఫుల్‌కు గురువులా మారి బౌలింగ్‌లో అన్ని రకాల టెక్నిక్స్ నేర్పించాడు. ఫలితమే SRH మ్యాచ్‌లో ప్రఫుల్ హింగే అద్భుత ప్రదర్శన. సాకిబ్ హుస్సేన్ బౌలింగ్ కెరీర్ కూడా వరుణ్ ఆరోన్ వల్లే అనుకోని మలుపు తిరిగింది. SRH టీంలోకి ఫాస్ట్ బౌలర్ల కోసం వరుణ్ ఆరోన్ అన్వేషిస్తున్న క్రమంలో.. MRF అకాడమీలో సాకిబ్‌ను గుర్తించి.. అతని బౌలింగ్ ను వరుణ్ ఆరోన్ గమనించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఉత్తర ప్రదేశ్‌పై వేసిన పదునైన స్పెల్‌తో షకీబ్ మళ్ళీ ఆరోన్ కంట్లో పడ్డాడు. సాకిబ్‌ను SRH జట్టులోకి తీసుకోవాలని మేనేజ్‌మెంట్ దగ్గర మొండిగా పట్టుబట్టి మరీ సాకిబ్ ను బేస్ ప్రైస్ 30 లక్షలకు రా=ూ జట్టులోకి తీసుకునేలా చేశాడు. సాకిబ్‌పై వరుణ్ ఆరోన్ పెట్టుకున్న నమ్మకం వృధాగా పోలేదు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 4 వికెట్లు తీసి సాకిబ్ హుస్సేన్ దుమ్ములేపాడు.



# జాన్వీ లుక్: ఆ నడుము మడతలో దాగిన హొయలు



నేటితరం కథానాయికల్లో జాన్వీ కపూర్ ఒక తిరుగులేని -షో స్టాపర్-గా దూసుకుపోతోంది. ఫ్యాషన్ సెన్స్ విషయంలో ఈ బ్యూటీని కొట్టేవాళ్లే లేరని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వైట్ అండ్ వైట్ ఫ్రాక్ లుక్ లో జాన్వీ ఎంతో అందంగా కనిపిస్తోంది. ముఖ్యంగా బ్యాక్‌లెస్ ఫోజులతో కుర్రకారులో గుబులు పుట్టిస్తోంది. పట్టీల ఫ్రాకులో జాన్వీ నడుము మడతలు నిజంగా గుబులు పుట్టిస్తున్నాయి.. జాన్వీ ఫోజులు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. కెరీర్ ప్రారంభంలో -ధడక్- సినిమాతో వెండితెరకు పరిచయమైనప్పుడు జాన్వీ నటన - లుక్స్ గురించి నెగటివ్ కామెంట్స్ చేసిన వారు కూడా ఇప్పుడు తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌కి ఫిదా అయిపోతున్నారు. కాలక్రమేణా గ్లామర్‌ను మెరుగుపరుచుకుంటూ ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకుంది. బికినీలో ఘాటైన పోజులు ఇచ్చినా.. స్విమ్ సూట్‌లో మెరిసినా లేదా స్టైలిష్ బ్లేజర్‌లో ప్రొఫెషనల్ లుక్‌లో కనిపించినా జాన్వీ శైలి అద్భుతంగా ఉంటుంది.కేవలం వెస్టన్ దుస్తుల్లోనే కాకుండా.. సాంప్రదాయక చీరకట్టులోనూ జాన్వీ అచ్చమైన భారతీయ నారిలా కనిపిస్తుంది. అటు మోడ్రన్ గ్లామర్.. ఇటు డివోషనల్ లుక్.. ఇలా ఏ వేషధారణలోనైనా జాన్వీ ఒదిగిపోయే తీరు అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఎప్పటికప్పుడు తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌ను పరిచయం చేస్తూ మిలియన్ల కొద్దీ ఫాలోవర్లను సంపాదించుకుంటోంది. ఈ వైట్ ఫ్రాక్ లుక్ కూడా జాన్వీలోని గ్లామర్ కోణాన్ని మరోస్థాయికి తీసుకెళ్లింది. ప్రస్తుతం జాన్వీకపూర్ టాలీవుడ్‌లోనూ సత్తా చాటుతోంది. -దేవర- సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన -పెద్ది- (బుచ్చిబాబు సానా చిత్రం)లో నటిస్తోంది. ఈ భారీ ప్రాజెక్టులో జాన్వీ



పాత్ర ఎలా ఉండబోతోందనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. ఈ చిత్రంలో జాన్వీ ఒక విభిన్నమైన గ్లామరస్ రోల్‌లో కనిపిస్తుందని సమాచారం. జాన్వీ గ్లామర్ యాటిట్యూడ్ కి మెగా ఫ్యాన్స్ కిల్ అవ్వడం ఖాయం.గ్లామర్ ఎలివేషన్ టాలెంట్ తో పాటు తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో సౌత్ - నార్త్ సినీ ఇండస్ట్రీలను జాన్వీ ఏకకాలంలో ఏలేస్తోంది. వైట్ డ్రెస్‌లో తను షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోలు ఫ్యాషన్ ప్రియులకు ఒక విజువల్ ట్రీట్‌గా నిలిచాయి. ఈ బ్యూటీ తన తదుపరి చిత్రం -పెద్ది-తో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965